విశాలాంధ్ర ప్రాంతీయం
గుంటూరు, బాపట్ల, పల్నాడు

అవ్వతాతలకు అండగా ప్రభుత్వం

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : అవ్వా, తాతలకు ప్రభుత్వం అండగా ఉంటుందని తూర్పు మహిళా నాయకురాలు నూరి ఫాతిమా, 4వ డివిజన్ కార్పొరేటర్ షేక్ మహమూద్ అన్నారు. ఇచ్చిన హామీని నిలబెట్టుకున్న రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పెద్ద కొడుకులా తన బాధ్యతను నిలబెట్టుకున్నారని తెలిపారు. తూర్పు నియోజక వర్గంలోని 4వ డివిజన్‌లోని 8,9,10,11 సచివాలయాలలో వృద్ధులు, వితంతువులు, వికలాంగులకు కొత్తగా మంజూరైన 35 జగనన్న పింఛన్ కానుకలను నూరి ఫాతిమా ముఖ్య అతిథిగా పాల్గొని మంగళవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక వైసీపీ నాయకులు, వెల్ఫేర్ సెక్రెటరీలు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

క్రయావిక్రయాలకు అవకాశం కల్పించండి

విశాలాంధ్ర-పెదకాకాని : మండల సీపీఐ ఆధ్వర్యంలో వెనిగండ్లలో గృహాలు నిర్మించుకొని జీవిస్తున్న వారికి క్రయావిక్రయములు జరిగేందుకు వీలు కల్పించాలని స్థానిక శాసనసభ్యులు కిలారి వెంకట రోశయ్యను కలసి వినతిపత్రం అందజేశారు. పొన్నూరు నియోజకవర్గ సీపీఐ కార్యదర్శి పుప్పాల సత్యనారాయణ అధ్యక్షత వహించగా ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కొల్లి రంగారెడ్డి మాట్లాడుతూ వెనిగండ్లలోని ధర్మతోపు చింతలతోపు తదితర డి నెంబర్లలో సుమారు 25 ఎకరాలలో గృహాలు నిర్మించుకొని వందేళ్లకు పైగా ఇంటి పన్ను, నీటి పన్ను, క్రయావిక్రయాలతో రిజిస్ట్రేషన్ జరుపుకుంటూ జీవనం సాగిస్తూ ఉంటే 2004లో రాష్ట్ర ప్రభుత్వం జీవో జారీ చేయడం వలన రిజిస్ట్రేషన్లు నిలిపివేశారన్నారు. అప్పటి నుంచి అనేకమంది అధికారులను కలిసి విన్నవించుకున్నా నివాసదారులకు ఫలితం దక్కలేదని అన్నారు. ఈ స్థలాలను వివాహ సమయంలో కుమార్తెలకు ఇవ్వటం వల్ల వారు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. అలాగే అన్నదమ్ములు పార్టిషన్ చేసుకుంటానికి లేక, డబ్బులు అవసరం అయితే బ్యాంకులలో తనఖా పెట్టుకునే అవకాశం కూడా లేకుండా పోవడం వలన ఆర్థికంగా అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం, అధికారులు స్పందించి క్రయవిక్రయాలు జరిగే విధంగా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వెనిగండ్ల సీపీఐ గ్రామ కార్యదర్శి బుల్ల బాబురావు, పెదకాకాని సీపీఐ కార్యదర్శి పాటిబండ్ల డేవిడ్‌రాజు, బి.వీరయ్య, వెంకటేశ్వర్లు, సాంబశివరావు, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సాహితీ జగత్తులో 'శ్రీశ్రీ' రచనలు అజరామరం

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : ఏ కొందరికో పరిమితమైన కవిత్వాన్ని సామాన్యులకు అందేటట్లు చేసిన శ్రీశ్రీ రచనలు సాహితీ జగత్తులో అజరామరంగా నిలిచి పోతాయని సాహితీవేత్తలు, కవులు, కళాకారులు నినదించారు. స్థానిక అవగాహన సంస్థ కార్యాలయంలో మహాకవి శ్రీశ్రీ జయంతి వేడుకలు జరి గాయి. ఈ సందర్భంగా శ్రీశ్రీ చిత్రపటానికి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం నాటక రచయిత, దర్శకులు కాపూరి సత్యనారాయణ మాట్లాడుతూ ఆధునిక ఆంధ్ర సాహిత్యంలో అభ్యుదయ యుగానికి నాందీ ప్రస్తావన చేసిన మహాకవి శ్రీరంగం శ్రీనివాసరావు అనే అసలు పేరు గల శ్రీశ్రీ కవిత్వంలో నూతన శకానికి ఆద్యుడిగా నిలిచారన్నారు. శ్రీశ్రీ రాసిన మహాప్రస్థానం ఆయనకు మంచి పేరు తీసుకొచ్చిందని, మరోప్రస్థానం, ఖడ్గ సృష్టి, చరమరాత్రి, అనంతంలాంటి రచనలు శ్రీశ్రీ ప్రతిభకు, పాండిత్యానికి ప్రతీకలుగా నిలిచాయని కొనియాడారు. రచయిత బండి జమదగ్ని మాట్లాడుతూ శ్రీశ్రీ తెలుగులో వినూత్న కవితా ప్రయోగశీలిగా, అభ్యుదయ కవితా మార్గ ప్రవర్తకుడిగా, భావ కవితాయుగంలో, భాషలో, వస్తువులో, చందస్సులో, కొత్తపోకడలను సృష్టించిన సత్కవిగా, తెలుగు సాహితీ చిత్రపటంలో విశేష ఖ్యాతిని ఆర్జించాడన్నారు. ఈ కార్యక్రమంలో సినీరంగ విశ్లేషకులు ఎ.అమరాచారి, శ్రీశ్రీ సినిమా పాటలను, మహాప్రస్థానం గేయాలను రాజశేఖర్, సాయిబాబా, సాంబయ్య తదితరులు ఆలపించారు.

దళితుల అభివృద్ధిని విస్మరించిన ప్రభుత్వాలు

విశాలాంధ్ర-గుంటూరు : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దళితుల అభివృ ద్ధిని పూర్తిగా విస్మరించాయని కేంద్ర మాజీ మంత్రి డాక్టర్ చింతా మోహన్ అన్నారు. చుండూరులో రక్తక్షేత్రాన్ని మంగళవారం సందర్శించిన ఆయన దళిత మృతవీరులకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా చింతామోహన్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభు త్వాలు దళితులను దగా చేయడంతో 1959-60లో దళితుల ఆర్థిక పరిస్థితి ఎలా ఉందో నేటికి అలానే ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎస్సీల ఆర్థిక పరిస్థితి అంధకారంలో ఉందని, అధిక వడ్డీలతో బాధపడుతూ ప్రతి కుటుంబం అప్పుల్లో కూరుకుపోయిందని ఆందోళన వ్యక్తం చేశారు. గత ఎనిమిది సంవత్సరాలలో ఎస్సీలు, ఎస్టీలు అభివృద్ధిలో 50 సంవత్సరాలు వెనక్కి వెళ్ళడం జరిగిందన్నారు. ఆక్వా కల్చరల్‌లో వేల ఎకరాలు ఎస్సీ భూములు తీసుకున్నా... కనీసం ఒక్క ఎస్సీ కూడా రొయ్యల ఉత్పత్తి వ్యాపారంలో లేకపోవడం శోచనీయమన్నారు. చీమకుర్తి గ్రానైట్ గనులలో ఒక్క ఎస్సీకి కూడా గనులు కేటాయించలేదని అన్నారు. ఎస్సీ కార్పొరేషన్ ద్వారా స్టార్ట్ అఫ్ ఇండియా ద్వారా నిధులు ఇవ్వకపోవడం బాధాకరమని అన్నారు.

వివాహిత అనుమానాస్పద మృతి

విశాలాంధ్ర-తాడేపల్లి : ఉండవల్లి కరకట్ట దగ్గర ఇస్కాన్ టెంపుల్ ఎదురుగా నివాసముం టున్న పుచ్చకాయల పావని(37) అనే మహిళ సోమవారం రాత్రి అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. ఉరి వేసుకుందని అత్తింటి వారు చెబుతుండగా హత్య అని మృతురాలి కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. పావని మృతిపై అనుమానాలు ఉన్నాయని విచారణ జరపాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ క్రమంలో భర్త మహేష్‌ని తాడేపల్లి పోలీసులు అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు.

గుండెపోటుతో కార్మికుడు మృతి

విశాలాంధ్ర-పొన్నూరు : పట్టణానికి చెందిన ప్లంబింగ్ కార్మికుడు షేక్ అబ్దుల్ గఫూర్(61) మంగళవారం పనిచేస్తున్న సమయంలో గుండె నొప్పి రావడంతో తోటి కార్మికులు హుటాహుటిన వైద్యశాలకు తీసుకువెళ్లగా అప్పటికే గఫూర్ మరణించినట్లు వైద్యులు ధ్రువీకరించారు. గఫూర్ మరణవార్త తెలుసుకున్న పొన్నూరు నియోజకవర్గ ఏఐటీయూసీ నాయకులు ఆరేటి రామారావు యూనియన్ సభ్యులతో వెళ్లి గఫూర్ భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. అనంతరం ఏఐటీయూసీ తరపున రూ.18 వేల ఆర్థిక సహాయం అందించారు. యూనియన్ ఉపాధ్యక్షుడు అచ్చయ్య, జాయింట్ సెక్రెటరీ తిక్కవరపు సుబ్బారావు, ట్రెజరర్ ఎస్కే నభి, సెక్రటరీ గుమ్మడి సుబ్బారావు, కార్యవర్గ సభ్యులు కొండేటి బ్రహ్మం, పఠాన్ కరిముల్లా, కటికల యల్లయ్య తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

సంబంధం లేదని నిరూపిస్తే రాజకీయాల నుంచి తప్పుకుంటా: మంత్రి

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : గుంటూరు వికాస్‌నగర్‌లో చోటుచేసుకున్న ఘటన చంద్రబాబుకు సంబంధం లేదని నిరూపిస్తే మంత్రి పదవికి, శాసన సభ్యత్వానికి రాజీనామా చేసి రాజకీయాల నుంచి తప్పుకుంటానని సాంఘిక, సంక్షేమశాఖా మంత్రి మేరుగ నాగార్జున సవాల్ విసిరారు. గుంటూరు ప్రభుత్వ సమగ్ర ఆసుపత్రి (జీజీహెచ్)లోని సుశ్రుత హాలులో మంగళవారం వికాస్‌నగర్‌లో జరిగిన కానుకల పంపిణీలో గాయ పడిన బాధితులను, కుటుంబ సభ్యులను మంత్రులు మేరుగ నాగార్జున, అంబటి రాంబాబు, విడదల రజని, ప్రభుత్వ విప్ డొక్కా మాణిక్యవర ప్రసాద్, ఎమ్మెల్సీ లేళ్ళ అప్పిరెడ్డి, ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్, నగర మేయర్ కావటి శివనాగ మనోహర్‌నాయుడు పరామర్శించి ఒక్కొక్క కుటుంబానికి రూ.50వేలు చెక్‌లను అందజేశారు. అనంతరం మేరుగ నాగార్జున మాట్లాడుతూ చంద్రబాబు అబద్దపు ప్రచారాలు, మోసపూరిత రాజకీయాలు చేస్తున్నారని ఆరోపించారు. గుంటూరులో జరిగిన సభకు టీడీపీ జిల్లా అధ్యక్షుడు తెనాలి శ్రవణ్ కుమార్ అనుమతి తీసుకున్నారని, సభలో దుప్పట్లు, కందిపప్పులు పంచి పెట్టి పేదల ప్రాణాలను తీస్తారా అని ప్రశ్నించారు. పేదలు చనిపోవడానికి ప్రేరేపించే విధంగా చంద్ర బాబు చేశారని, దీన్ని సుమోటాగా తీసుకుని కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. అంబటి రాంబాబు మాట్లాడుతూ నూతన సంవత్సరంలో గుంటూరులో జరిగిన సంఘటన దిగ్భ్రాంతి కలిగించిందన్నారు. రాష్ట్రంలో బహిరంగ సభలు పెట్టి ప్రజలను బలి చేయవద్దని, ఇలాంటి ఘటనలో టీడీపీ కార్యకర్తలు చనిపోయిన అమాయక ప్రజలు పట్ల వైసీపీ ప్రభుత్వం అండగా నిలుస్తుందని ఆయన హామీ ఇచ్చారు. విడదల రజని మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబుకు ప్రచార యావతో ప్రజలను మభ్యపెట్టి సభకు తరలించి ముగ్గురి ప్రాణాలను బలి తీసుకున్నాడని ధ్వజమెత్తారు. ముఖ్యమంత్రి జగన్ పాలనలో ప్రజలు ఎంతో సంతోషంగా ఉన్నారని, వికాస్ నగర్ ఘటనలో ముగ్గురు చనిపోగా 19 మందికి పైగా గాయపడ్డారన్నారు. మృతుల కుటుంబానికి రూ.2లక్షలు, గాయపడిన వారికి ఒక్కొక్కరికి రూ.50 వేలు చొప్పున ఆర్థిక సహాయం అందచేసినట్లు ఆమె చెప్పారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డు చైర్మన్ చంద్రగిరి ఏసురత్నం, డిప్యూటీ మేయర్ షేక్.సజీల, జిల్లా గ్రంథాలయం సంస్థ చైర్మన్ బత్తుల దేవానంద్, వైసీపీ కేంద్ర మండలి సభ్యులు తాడిశెట్టి మురళీ మోహన్, కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి, జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ప్రభావతి, వైసీపీ నేతలు గులాం రసూల్, పచ్చల ఆనంద్ పాల్గొన్నారు.

వైసీపీ ప్రభుత్వ నిరంకుశ వైఖరికి నిరసనగా ఉద్యమిద్దాం: జంగాల

విశాలాంధ్ర-గుంటూరు : వైసీపీ ప్రభుత్వ నిరంకుశ వైఖరికి నిరసనగా ఉద్యమించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్‌కుమార్ పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 1861 పోలీసు యాక్ట్ చట్టాన్ని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ సీపీఐ నగర సమితి ఆధ్వర్యంలో గుంటూరు మల్లయ్యలింగంభవన్ నుంచి పాత బస్టాండ్ సెంటర్ వరకు మంగళవారం ప్రదర్శన నిర్వహించారు. అనంతరం రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన జీవో కాపీలను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా జంగాల అజయ్‌కుమార్ మాట్లాడుతూ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం ఇతర రాజకీయ పార్టీల కార్యక్రమాలను అడ్డుకుంటూ తమ పార్టీ మినహా ఏ ఇతర రాజకీయ పార్టీలు సభలు, సమావేశాలు నిర్వ హించరాదనే ఆంక్షలు కర్కశంగా విధిస్తున్నారన్నారు. అనుమతి కోరితే నిరాకరిస్తూ, కార్యక్రమాలు నిర్వహిస్తే అరెస్టులు చేసే అప్రజాస్వామిక పద్ధతులకు ప్రభుత్వం పూనుకుంటుందన్నారు. ఇటీవల జరిగిన కందుకూరు సంఘటన, గుంటూరులో ఎన్నారై నిర్వహించిన సంక్రాంతి కానుక ఏమాత్రం హర్షించదగింది కాదని అన్నారు. కార్యక్రమాల నిర్వాహకులు తగు జాగ్రత్తలు తీసుకొని పోలీసు వారు మరింత అప్రమత్తతతో ఉండి ఉంటే ఇలాంటి ఘటనలు చోటు చేసుకునేవి కాదన్నారు. ఇటువంటివి జరగకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాల్సిన నేపథ్యంలో దీన్నే సాకుగా చూపి ఏ పార్టీలు సభలు, సమావేశాలు కార్య క్రమాలు నిర్వహించరాదని 1861 చట్టాన్ని తీసుకు రావడం ప్రభుత్వ రాక్షసత్వానికి పరాకాష్ట అని అన్నారు. ఇలాంటి సందర్భంలో అన్ని రాజకీయ పార్టీలు ఒకే వేదిక పైకి వచ్చి చట్టం ఉపసంహరించే వరకు పోరాటంలో కలిసి రావాలని పిలుపునిచ్చారు.

సీపీఐ నగర కార్యదర్శి కోట మాల్యాద్రి మాట్లాడుతూ అధికార పార్టీ పోలీసు వ్యవస్థను నిర్వీర్యం చేస్తుందని, సభలు సమావేశాలు, నిరసన కార్యక్రమాలకు పోలీసుల అనుమతి లేనిదే చేయకూడదని చెప్పడం సరైనది కాదన్నారు. ఇప్పటికే 30 యాక్ట్, 144 సెక్షన్‌లతో నిర సన కార్యక్రమం నిర్వహించిన వారిని అణచివేస్తున్న ఈ ప్రభుత్వం కొత్తగా ఈ జీవోను విడుదల చేయడం ఏమాత్రం సమంజసం కాదని అన్నారు. ఈ కార్యక్రమంలో ఇప్టా జాతీయ అధ్యక్షులు గని, సీపీఐ నగర కార్యవర్గ సభ్యులు జి.సురేష్ బాబు, ఆకిటి అరుణ్ కుమార్, రావుల అంజిబాబు, చల్లా మరియదాసు, శశి, సిహెచ్ విజయ్ కుమార్, సీనియర్ నాయకులు నూతలపాటి చిన్న, నగర సమితి సభ్యులు జగన్నాథం, బి.వెంకటేశ్వర రెడ్డి, రాయల వెంకటేశ్వర్లు, ఏసురత్నం, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

'యువశక్తితో' యువతకు పవన్ దిశానిర్దేశం

విశాలాంధ్ర-గుంటూరు : తమ స్వార్థ ప్రయోజనాల కోసం దశాబ్దాల కాలంగా రాజకీయ నాయకులు యువతలో ఉన్న శక్తి సామర్థ్యాలను నిర్వీర్యం చేస్తూ వచ్చారని, దిక్కుతోచని స్థితిలో ఉన్న యువతకు యువశక్తి సభ ద్వారా జనసేన అధినేత పవన్ కళ్యాణ్ దిశానిర్దేశం చేయనున్నారని జనసేన పార్టీ గుంటూరు అర్బన్ అధ్యక్షుడు నేరేళ్ళ సురేష్ అన్నారు. స్వామి వివేకానంద జయంతి సందర్భంగా ఈ నెల 12న ఉద్యమాలకు ఊపిరి పోసే శ్రీకాకుళంలోని రణస్థలిలో జరిగే యువశక్తి బహిరంగ సభ గోడప్రతులను మంగళవారం పరమాయగుంటలోని నగర పార్టీ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉక్కు నరాలు, ఇనుప కండరాలు ఉన్న యువతతోనే ఈ దేశ భవిష్యత్తు ఆధారపడి ఉందని స్వామి వివేకానంద ఉద్బోధించేవారన్నారు. దేశానికి పట్టుకొమ్మల్లాంటి యువతను మద్యం, గంజాయి, హెరాయిన్ వంటి మాదకద్రవ్యాలకు బానిసను చేసి యువశక్తిని రాజకీయ నాయకులు ఎప్పటికప్పుడు నిర్వీర్యం చేస్తూనే ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా అధికార ప్రతినిధి ఆళ్ళ హరి మాట్లాడుతూ రాష్ట్రంలో యువత ఎదుర్కొంటున్న సమస్యలపై జనసేనాని శంఖారావాన్ని పూరిస్తున్నారన్నారు. కార్పొరేటర్ యర్రంశెట్టి పద్మావతి మాట్లాడుతూ తమ దాష్టీకాల, అరాచకాల నుంచి యువత దృష్టి మరల్చేందుకే రాష్ట్రాన్ని గంజాయి లాంటి మాదకద్రవ్యాలకు నిలయంగా మార్చారని విమర్శించారు. యువశక్తికి రాష్ట్ర నలుమూలల నుంచి పెద్దఎత్తున యువకులు తరలిరావాలని కోరారు. సమావేశంలో కార్పొరేటర్ దాసరి లక్ష్మీ దుర్గ, నగర ఉపాధ్యక్షుడు కొండూరి కిషోర్, ప్రధాన కార్యదర్శులు యడ్ల నాగమల్లేశ్వరరావు, కటకంశెట్టి విజయలక్ష్మి, ఆనంద్ సాగర్, ఉదయ్, నాగేంద్ర సింగ్, గడదాసు అరుణ, పులిగడ్డ గోపి, కొత్తకోట ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ నిర్ణయం నిరంకుశానికి నిదర్శనం

విశాలాంధ్ర-గుంటూరు : కందుకూరు, గుంటూరు ప్రమాద ఘటనలను సాకుగా చూపి ర్యాలీలు, సభలు, రోడ్‌షోలపై నిషేధం విధిస్తూ జగన్ సర్కార్ తీసుకున్న నిర్ణయం నిరంకుశానికి నిదర్శనమని టీడీపీ గుంటూరు నగర అధ్యక్షులు డేగల ప్రభాకర్ అన్నారు. స్థానిక నగర పార్టీ కార్యాలయంలో మంగళవారం ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో రోడ్లపై సభలు, ర్యాలీలు నిర్వహించడంపై నిషేధం విధిస్తూ రాష్ట్ర ప్రభుత్వ తాజా జీఓపై మండిపడ్డారు. జగన్ పాలనలో ప్రజాస్వామ్యం ఖూనీ అయిందన్నారు. ప్రజా ఉద్యమాలను, ప్రశ్నించే గొంతుకలను అణచివేసే కుట్రలో భాగమే 1861 పోలీస్ యాక్ట్ అని అన్నారు. ఐదేళ్ల పాటు జగన్ కుటుంబమంతా రోడ్లపై ర్యాలీలు, సభలు పెట్టారని, నేడు అధికారంలోకి వచ్చిన తర్వాత రోడ్లపై ర్యాలీలు వద్దంటారా? అని ప్రశ్నించారు. ర్యాలీలు రోడ్లపై కాకుండా గాల్లో చేస్తారా? అని ఎద్దేవా చేశారు. రాజకీయ పార్టీల ర్యాలీలు, సభలకు బందోబస్తు ఇవ్వడం మీకు చేతకాదని అర్థం చేసుకోవాలా అంటూ నిలదీశారు. ఈ నిర్ణయాలు ప్రజాస్వామ్యానికే మచ్చ అని అన్నారు. గతంలో ఇలాంటి ఆంక్షలు ఉండి ఉంటే జగన్ పాదయాత్ర చేయగలిగేవారా అని ప్రశ్నించారు. అప్రజాస్వామిక చర్యలను సహించేది లేదన్నారు. ఈ నిర్ణయంపై జగన్ పునరాలోచన చేయాలని డిమాండ్ చేశారు.

ప్రజా ఆరోగ్య పరిరక్షణకు కృషి: మాల్యాద్రి

విశాలాంధ్ర-గుం టూరు : ఆరోగ్యమే మహాభాగ్యం అని, గుంటూరు నగరంలోని ప్రజా సమస్యలతో పాటు ప్రజల ఆరోగ్యం కోసం మెడికల్ క్యాంపుల ద్వారా సీపీఐ ప్రజల ఆరోగ్య పరిరక్షణకు కృషి చేస్తుందని సీపీఐ నగర కార్యదర్శి కోట మాల్యాద్రి అన్నారు. ఉచిత నేత్ర పరీక్షలు, శుక్లాల ఆపరేషన్ కోసం శంకర కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో మంగళవారం సీపీఐ ఆధ్వర్యంలో చాకలి గుంటలో మెడికల్ క్యాంపు నిర్వహించారు. ఈ సందర్భంగా కోట మాల్యాద్రి మాట్లాడుతూ రోజురోజుకీ ప్రజల ఆరోగ్య పరిస్థితి చాలా దీనస్థితికి చేరుతుందని, ప్రస్తుత సమాజంలో ప్రతిదీ కల్తీల ద్వారా జరుగుతున్న నేపథ్యంలో ప్రజలు ఆరోగ్యం మీద శ్రద్ధ వహించాలన్నారు. సర్వేంద్రియానం నయనం ప్రధానమని పెద్దలు చెప్పిన విధంగా సమాజంలో జరుగుతున్న పరిణామాలు చూడటానికి నేత్రాలు ప్రధమ అవయవాలని, వాటి పరిరక్షణ కోసం తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు రావుల అంజిబాబు, చాకలగుంట డివిజన్ కార్యదర్శి చిన్నపోతుల విజయ్ కుమార్, కిషోర్, చాకలగుంట ప్రజానీకం పాల్గొన్నారు.

సాహితీ పోరాట యోధుడు కవిరాజు త్రిపురనేని

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జాషువా పూలే పెరియార్ లిటరేచర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్థానిక బ్రాడీపేటలోని సీపీఎం హాలులో ఈ నెల 9వ తేదీ సాయంత్రం 5గంటలకు కవిరాజు త్రిపు రనేని రామస్వామి చౌదరి పురస్కార సభ జరుగుతుందని విరసం సీనియర్ నాయకులు సీఎస్ఆర్ ప్రసాద్ తెలిపారు. ఈ మేరకు స్థానిక బ్రాడీపేట 4వ లైనులోని మద్రాస్ కాఫీ వద్ద పురస్కారానికి సంబందించిన ఆహ్వాన పత్రిక ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా సీఎస్ఆర్ ప్రసాద్ మాట్లాడుతూ సాహితీ పోరాట యోధుడు కవిరాజు త్రిపు రనేని రామస్వామి చౌదరి అని అన్నారు. కవిరాజు త్రిపురనేని రామస్వామి చౌదరి పురస్కా రాలు ఆచార్య రాచపాలెం చంద్రశేఖర్‌రెడ్డి, దళిత బహుజన ఫ్రంట్ వ్యవస్థాపక అధ్యక్షులు, పరివర్తన పత్రిక సంపాదకులు కొరివి వినయ్‌కుమార్, అరసం జాతీయ కార్యదర్శి పెనుగొండ లక్ష్మీనారాయణ, కవి, కథకుడు, సాహితీ విమర్శకుడు కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత పాపినేని శివశంకర్‌లకు ఇవ్వనున్నట్లు చెప్పారు. 'రామస్వామి చౌదరి సమకా లీనత' అనే అంశంపై వైసీపీ గుంటూరు జిల్లా అధ్యక్షులు, ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ డొక్కా మాణిక్య వరప్రసాద్, పూర్వహక్కుల సంఘం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలుకా చంద్రశేఖర్‌లు మాట్లాడనున్నట్లు ఆయన చెప్పారు. కార్యక్ర మంలో కవులు ఎస్ఎం సుభాని, విల్సన్, కడియం జెంట్స్ బి.శ్యాంబాబు, నాయి బ్రాహ్మణ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు తాటికొండ నరసింహారావు, మల్లమాంబ కళాపరిషత్ కౌంటర్ అండ్ చైర్మన్ గొల్లపల్లి లలిత్ కుమార్, ప్రజాపతి, మధుర గాయకులు జాన్‌బాబు, చంద్రపాల్ తదితరులు పాల్గొన్నారు.

స్పందన ఈదా ఫౌండేషన్ సేవలు ప్రశంసనీయం

విశాలాంధ్ర-గుంటూరు : యువత క్షణిక ఆవేశాలతో జీవితాలను పాడు చేసుకోకుండా వారికి మూడేళ్లుగా అనేక చైతన్యవంతమైన కార్యక్రమాల ద్వారా దిశ నిర్దేశం చేస్తున్న స్పందన ఈదా ఇంటర్నేషనల్ ఫౌండేషన్ సామాజిక సేవలు ఎంతగానో అభినందనీయమని జిల్లా ఉమెన్ ప్రొటెక్షన్ సెల్ ఎస్పీ కేజీవీ సరిత అన్నారు. ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ శామ్యూల్ రెడ్డి కుమార్తె స్పందన 3వ వర్ధంతి సందర్భంగా జూమ్ యాప్ ద్వారా 'గుర్తుందా చిన్న! నీకు గుర్తుందా?!' అనే ఆడియో పాటను ఎస్పీ సరిత విడుదల చేశారు. ఆమె మాట్లాడుతూ జీవితం చాలా విలువైనదని, ఏ సమస్య ఉన్నా మనోధైర్యంతో ముందుకు వెళ్లాలని యువతను కోరారు. సర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య, డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం లాంటి ప్రముఖుల జీవితాలను ఆదర్శంగా తీసుకొని ముందు తరాలకు మార్గదర్శకులు అవ్వాలని కోరారు. శామ్యూల్ రెడ్డి మాట్లాడుతూ యువత పరిపూర్ణమైన వ్యక్తులుగా వ్యవస్థగా మార్చాలని ఉద్దేశంతో పాట ఆడియో ఆవిష్కరించామని, ఈ పాటకు అనుగుణంగా డాన్స్ కంపోజ్ చేసి వీడియో షూట్ చేసి spandanaedaif@gmail.comకు మెయిల్ ద్వారా ఫిబ్రవరి 12వ తేదీలోగా పంపించాలని కోరారు. వీడియోలను యూట్యూబ్ ఛానల్ ద్వారా ప్రదర్శిస్తారని, వీక్షించిన ప్రజల స్పందన, న్యాయ నిర్ణేతలు ఇచ్చిన మార్కుల ఆధారంగా విజేతల ఎంపిక జరుగుతుందని, నగదు పురస్కారాలు అందచేస్తామని పేర్కొన్నారు. వివరాలకు 8885558129, 9010442773లలో సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ ముఖ్య సలహాదారు ప్రొఫెసర్ విశ్వనాథం, డైరెక్టర్ ఈ.అంజిరెడ్డి, నిర్మల, నేషనల్ కమిటీ సభ్యులు సిహెచ్ ఎస్ఎస్ మూర్తి, షేక్ మీరావాలి, పి.కిషోర్ కుమార్, గుండాల శ్రీనివాసరావు, మాదా చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

ధర్నాలు, ర్యాలీలు నిషేధించే హక్కు రాష్ట్ర ప్రభుత్వానికి లేదు

విశాలాంధ్ర-గుంటూరు : నోట్లరద్దును సమర్థిస్తూ సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును ప్రతిఒక్కరూ స్వాగతించాల్సిన అవసరం ఉందని బీజేపీ లీగల్ సెల్ విభాగ ఇన్‌చార్జ్ సీనియర్ నాయకులు జూపూడి రంగరాజు, జిల్లా అధ్యక్షులు పాటిబండ్ల రామకృష్ణ అన్నారు. రైలుపేటలోని జూపూడి రంగరాజు నివాసంలో మంగళవారం వారు మాట్లాడుతూ పెద్దనోట్ల రద్దు నిర్ణయం వలన దేశానికి గొప్ప మేలు జరిగిందని చెప్పారు. సంక్రాంతి కానుక పంపిణీ పేరుతో జరిగిన ఘటనలో చనిపోయిన మూడు కుటుంబాలకు బీజేపీ ప్రగాఢ సానుభూతి తెలుపుతుందన్నారు. ప్రచారాల కోసం టీడీపీ, వైసీపీలు ప్రజల ప్రాణాలు తీయొద్దని హితవు పలికారు. కందుకూరు, గుంటూరులో జరిగిన ఘటనలకు ప్రజలకు క్షమాపణ చెప్పాలని, సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించి ప్రజలకు నిజాలు తెలపాలని డిమాండ్ చేశారు. ధర్నాలు, ర్యాలీలను నిషేదించే హక్కు రాష్ట్ర ప్రభుత్వానికి లేదని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో సురేష్ జైన్, రాచుమల్లు భాస్కర్, అప్పిశెట్టి రంగా, కుమార్ గౌడ్, గారపాటి పూర్ణ, డాక్టర్ శనక్కాయల ఉమా శంకర్, పాలపాటి రవికుమార్, భీమినేని చంద్రశేఖర్, వనమా నరేంద్ర, పద్మనాథం, సుధాకర్, బుజ్జిబాబు, తాడువాయి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సావిత్రిభాయి పూలే జయంతి

తెనాలి : పట్టణ పరిసర ప్రాంతాలలో మంగళవారం సావిత్రిబాయి పూలే జయంతి నిర్వహించారు. గాంధీచౌక్‌లో బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో 192వ జయంతి జరిగింది. పలువురు నాయకులు సావిత్రిబాయి పూలే గురించి మాట్లాడారు. తెనాలి, మునిసిపల్ బాయిస్ హైస్కూల్‌లో పూర్వవిద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో సావిత్రిబాయి జయంతి జరుపుకున్నారు. ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి జేజేలు పలికి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు విజ్ఞానంతోపాటు విద్యనందిస్తున్న పాఠశాల ప్రధానోపాధ్యాయిని షేక్ మౌలాబిని ఘనంగా సత్కరించి మెమెంటో బహూకరించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థుల సంఘ వ్యవస్థాపకులు తన్నీరు శివశంకర్, చుక్కా భానుప్రసాద్, కాసరనేని శ్రీనివాసరావు, చావలి రాంబాబు, ఉపాధ్యాయునిలు రాజరాజేశ్వరి, కృష్ణవేణి, విద్యార్థులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర-గుంటూరు కార్పొరేషన్ : మహిళా సాధికారత కోసం... మహిళల అభివృద్ధి కోసం కృషి చేసిన సావిత్రిభాయి పూలే జయంతి వేడుకలు రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా జరపాలని బీసీ సంక్షేమ సంఘం యువజన అధ్యక్షులు ఉప్పాల రాజ్ కిరణ్ అన్నారు. స్థానిక అరుండల్‌పేటలోని మోర్ల వెంకట కృష్ణ కార్యాలయంలో సావిత్రిభాయి పూలే జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం రాజ్‌కిరణ్ మాట్లాడుతూ విద్య ద్వారానే మహిళాభివృద్ధి సాధ్యమని అప్పట్లోనే చాటిచెప్పిన వనిత సావిత్రిభాయి పూలే అని కొనియాడారు. మోర్ల వెంకట కృష్ణ మాట్లాడుతూ దేశంలోనే మొట్టమొదటి మహిళా ఉపాధ్యాయని సావిత్రిభాయి పూలే అన్నారు. ఆమెకు భారతరత్న అవార్డు ఇవ్వాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ వేడుకల్లో బీసీ సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి కొల్లూరు హనుమంతరావు, తుళ్లూరు వేణుగోపాల్, సుభాని,కెకె రవి, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

మంగళగిరి : విశ్వబ్రాహ్మణ సంఘం కార్యాలయంలో మంగళవారం ఆంధ్రప్రదేశ్ బీసీ సేన ఆధ్వర్యంలో తొలి భారతీయ మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రిబాయి పూలే జయంతి జరిగింది. ఆమె చిత్రపటానికి బీసీ సేన జిల్లా అధ్యక్షులు గోలి నాగ కుమార్, నాయకులు పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాగ కుమార్ మాట్లాడుతూ మహిళలకు విద్య నిషేధం ఉన్న రోజుల్లో సావిత్రిబాయి పూలే మహిళల హక్కుల కోసం పోరాటం చేసి 52 పాఠశాలలు స్థాపించి బడుగు బలహీన వర్గాల మహిళలకు విద్యను అందించారన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ సేన నియోజకవర్గ అధ్యక్షులు సాదు వేణుగోపాల్, నాయకులు కుంచాల కిషోర్, మినీగ ఆంజనేయులు, గండికోట వెంకయ్య, నక్కా దుర్గారావు పాల్గొన్నారు.

గుంటూరు : భారతీయ సంఘ సంస్కర్త, మొట్ట మొదటి మహిళా ఉపాధ్యాయిని, రచయిత్రి, కుల మత భేదాలకు అతీతంగా సమా జాన్ని ప్రేమించిన ప్రేమస్వరూ పిణి సావిత్రి బాయి పూలే జయంతి సందర్భంగా గుంటూరు నగరంలోని పినపాటి ప్రభుదాస్ మున్సిపల్ హైస్కూల్‌లో ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో సావిత్రి బాయి పూలే జయంతిని విద్యార్థులతో కలిసి మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నగర కార్యదర్శి యశ్వంత్, మేఘన సంధ్య, వెంకీ, రాహుల్, అజయ్, చందు, ఆకాష్ తదితరులు పాల్గొన్నారు.

గుంటూరు కార్పొరేషన్: సామాజంలోని అసమానతలను రూప్ప మాపుటకు అక్షర ఉద్యమానికి పిలుపునిచ్చి, బాలికల విద్య కోసం నిరంతరం కృషి చేసిన మహనీయురాలు సావిత్రి బాయి పూలే అని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర యువజన అధ్యక్షుడు, జాతీయ ప్రధాన కార్యదర్శి కుమ్మర క్రాంతికుమార్ కొనియాడారు. సావిత్రిబాయి పూలే జయంతి సందర్భంగా మంగళవారం స్థానిక చుట్టుగుంట బీసీ సంక్షేమ సంఘం కార్యాలయంలో ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. బీసీ సంక్షేమ సంఘం గుంటూరు జిల్లా యువజన అధ్యక్షులు తురక రమేష్, బీసీ నాయకులు తమిశెట్టి రాజు, కుమ్మర శ్రీ హర్ష నివాళులర్పించారు.

ఫిరంగిపురం: సావిత్రిబాయి పూలె దేశానికి చేసిన సేవలు చిరస్మరణీయమని మండల విద్యాశాఖాధికారి సాల్మన్‌రాజు అన్నారు. ఆమె జయంతి వేడుకను పురస్కరించుకొని మండలంలోని గొల్లపాలెం గ్రామంలో ఎంపీపీ పాఠశాలలో చిత్రపటానికి పూల మాలలు వేసి ఘన నివాళులర్పించారు. సావిత్రి బాయి భారత దేశ మొదటి మహిళా ఉపాధ్యాయురాలని, గొప్ప మహిళా విద్యా ప్రదాతని, సామాజిక విప్లవ కారిణి అని ఎంఈవో ఈ సందర్భంగా కొనియాడారు. నిమ్నజాతి వర్గాల అభ్యున్నతికి ఎనలేని కృషి చేశారని, కుల,మతాలకు అతీతంగా సమాజాన్ని ప్రేమించిన ప్రేమ స్వరూపిణి ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలని కోరారు. కార్యక్రమంలో పాఠశాల సముదాయ ప్రధానోపాధ్యాయులు ఇమ్మానియేల్, ఎంపియుపియస్ పాఠశాల హెచ్‌యం.జోసప్ సుధీర్‌బాబు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : ఓల్డ్‌క్లబ్ రోడ్డులో ఉన్న 'మేడ్' రాష్ట్ర కార్యాలయంలో భారతదేశ మొదటి మహిళ ఉపాధ్యాయిని సావిత్రిభాయి పూలే 192వ జయంతి నిర్వహిం చారు. ఈ సందర్భంగా ఆమె చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. 'మేడ్' రాష్ట్ర అధ్యక్షులు మురికిపూడి దేవపాల్ మాట్లాడుతూ సంఘ సంస్కర్త, మహనీయులు జ్యోతిరావు పూలే సహాయంతో విద్య నేర్చుకొని తాను ఉపాధ్యాయినిగా మారి విద్యకు దూరంగా ఉన్న దళిత మహిళల కోసం మొదటి పాఠశాలను స్థాపించినట్లు ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో గోకనకొండ శరత్‌బాబు, నర్రా వెంకట కోటయ్య, కొమ్ము లాజరు, షేక్ బుడె, కోటేశ్వరరావు, పరిమి దానియేలు, దాసరి నాగేశ్వరరావు, వాడపల్లి రమేష్, కొలగాని జోషి, షేక్ మస్తాన్, మేకల యేసుదానం, డేవిడ్ తదితరులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : సమాజంలోని అసమానత లను రూపుమాపుటకు నిరం తరం అక్షర ఉద్యమానికి పిలు పునిచ్చింది సావిత్రిభాయి పూలే అని భీమ్ భారత్ రాష్ట్ర అధ్యక్షులు పాగళ్ళ ప్రకాష్ తెలిపారు. అరండల్‌పేటలోని కార్యాలయంలో ఆమె 192వ జయంతి మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. పాగళ్ళ ప్రకాష్ ముఖ్య అతిథిగా మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాలను చైతన్య పరుచుటకు నిరంతరం కృషి చేసిన మహనీయురాలు సావిత్రిభాయి అని కొనియాడారు. కార్యక్రమానికి భీమ్ భారత్ జిల్లా నాయకులు రావినూతల కమలకుమారి అధ్యక్షత వహించగా దొడ్డ ప్రసాద్, జేల్డి మోహన్, బాజి, సీహెచ్ కోటేశ్వరమ్మ, కె.లక్ష్మి, ముని, యరగుట్ల సుజాత రావు, పసుమర్తి రమేష్, అనంద్ పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలకు ప్రాధాన్యత

విశాలాంధ్ర-తాడికొండ: రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ పథకాలకు అధిక ప్రాధాన్యిస్తుందని తాడికొండ నియోజకవర్గ అదనపు సమన్వయకర్త కత్తెర సురేష్ కుమార్ తెలిపారు. వైయస్సార్ పెన్షన్ పథకం కింద రూ.2750లు పెంచిన సందర్భంగా స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో మంగళవారం కృతజ్ఞత సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సురేష్ కుమార్ మాట్లాడారు. పేద బడుగు బలహీన వర్గాల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని రాష్ట్ర ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తుందని అన్నారు. అమ్మఒడి, ప్రభుత్వ పాఠశాలలో ఇంగ్లీషు విద్య, విదేశీ విద్య గురించి వివరించారు. కార్యక్రమంలో ఎంపీపీ తాళ్ల భాగ్యలక్ష్మి శివ నాగరాజు, సర్పంచులు తోకల సరోజినీ నరసింహారావు, మాదాసు రవి, కుమారి, బెజ్జ మహేష్ ముప్పాళ్ళ మనోహర్, బిక్కి శివరామకృష్ణ, పార్టీ నాయకులు కొమ్మినేని రామచంద్ర రావు, అవుతు శ్రీనివాసరెడ్డి, బి వెంకటేశ్వర రెడ్డి, దాములూరి రాము, ఉండవల్లి నరసింహారావు, జగదీష్, ఎంపీడీవో బిక్కి మహేష్ బాబు, మహిళలు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే శంఖుస్థాపన

విశాలాంధ్ర-నరసరావు పేట: కోటప్పకొండలో ఫిబ్రవరిలో జరిగే మహా శివరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని అన్ని ఏర్పాట్లు సకాలంలో పూర్తిచేసి వేడుకలను విజయవంతంగా జరిగేలా చర్యలు తీసుకుం టున్నామని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి తెలియజేశారు. మంగళవారం దేవస్థానం పైన, దేవస్థానం కింద ఐదు కోట్ల వ్యయంతో చేపటనున్న అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కోటప్పకొండకు చుట్టుపక్కల ఉన్న లింకు రోడ్లను రూ.50 లక్షల జడ్పీ నిధులతో మరమ్మతులు చేస్తున్నా మన్నారు. అలాగే కోటప్పకొండ డాక్యుమెంటరీ, సూట్ రూమ్స్, అన్నదాన సత్రంను తిరునాళ్లకి రెడీ చేస్తున్నట్లు తెలియజేశారు. అనంతరం ఎలమంద బ్రిడ్జి పనులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం అధికారులు, ఎంపీపీ మొరబోయిన శ్రీనివాసరావు, మురే రవీంద్రా రెడ్డి, కనక పుల్లారెడ్డి, మోర సాంబి రెడ్డి, వంపుగుడి జాన్, వెన్నపూస నాగిరెడ్డి, మట్లలింగారెడ్డి, జక్కిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ పాలన అధ్వానం: చదలవాడ

విశాలాంధ్ర-నరసరావుపేట: రాష్ట్రంలో పాలన అత్యంత అధ్వానంగా ఉందని, చరిత్రలో ఎక్కడూ లేని విధంగా ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని నరసరావుపేట నియోజకవర్గ టీడీపీ ఇంచార్జి డాక్టర్ చదలవాడ అరవింద బాబు అన్నారు. నరసరావుపేట మండలం కేసనపల్లి పంచాయతీలోని లలితాదేవి కాలనీలో మంగళ వారం "ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి" కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేచిన అరవిందబాబు ఇంటింటికి వెళ్ళి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మూడేళ్ళ వైసీపీ పాలనలో ప్రభుత్వం ప్రజలను అనేక ఇబ్బందులు పెడుతుందన్నారు. చంద్రబాబునాయుడును రానున్న ఎన్నికల్లో ముఖ్యమంత్రిగా గెలిపించు కోవాలన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు చింతల శ్రీనివాస్ రావు, పుచ్చకాయల బసవేశ్వర రావు, బలస్వామి, చెన్నయ్య, వీరయ్య, సికినం అమర్నాథ్, లింగాల లక్ష్మీ నారాయణ, గద్దె నాగేశ్వరరావు, సుబ్బులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జిల్లాలో సదరం క్యాంపులు

విశాలాంధ్ర-నరసరావుపేట: దివ్యాంగులకు సంబంధించి జిల్లాలోని వివిధ ప్రభుత్వ ఆసుపత్రుల వద్ద సదరం క్యాంపులు నిర్వహిస్తున్నట్లు డీసీహెచ్ఎస్ డాక్టర్ బీవీ రంగరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం, శుక్రవారం నరసరావుపేట గవర్నమెంట్ హాస్పిటల్ నందు, శుక్రవారం సత్తెనపల్లిలో, బుధవారం చిలకలూరిపేటలో, మంగళవారం పెదకూరపాడులో, శుక్రవారాలలో వినుకొండ, గురజాల, మాచర్ల గవర్నమెంట్ హాస్పిటల్స్ వద్ద నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆయా వారముల నందు సదరం స్లాట్స్ బుకింగ్ చేసుకున్న వారికి చూడబడునని తెలిపారు.

వైఎస్సార్ పెన్షన్ కానుక పోస్టర్ ఆవిష్కరణ

విశాలాంధ్ర-దుర్గి : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం అర్హులైన వారందరికీ అందిస్తున్న పెన్షన్ల పథకం భరోసా లాంటిదని ఎంపీపీ యేచూరి సునీత సాయి శంకర్ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలోని ఎంపీపీ కార్యాలయంలో మంగళవారం పెన్షన్ల వారోత్సవాల్లో భాగంగా వైఎస్సార్ పెన్షన్ కానుక పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఎంపీడీఓ జీఎల్ఎన్ గుప్తా, సూపరింటెండెంట్ శివప్రసాద్, సీనియర్ అసిస్టెంట్ రాజు ఉన్నారు.

అర్హులందరికీ సామాజిక పింఛన్లు: కలెక్టర్

విశాలాంధ్ర-నరసరావుపేట కలెక్టరేట్: ప్రభుత్వం అందిస్తున్న పెన్షన్ కానుకను అర్హత ఉన్న ప్రతీ ఒక్కరు తీసుకొని ఆరోగ్య, ఆర్థిక ప్రయోజనాలు పొందాలని పల్నాడు జిల్లా కలెక్టర్ శివ శంకర్ లోతేటి పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక మున్సిపల్ అతిథి గృహంలో వై.ఎస్.ఆర్ పెన్షన్ కానుక పంపిణి కార్యక్రమం జిల్లా గ్రామీణ అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో నూతన పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో కలెక్టర్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. రాజమహేంద్రవరం ఆర్ట్స్ కళాశాలలో జరిగిన ఈ కార్యక్రమ బహిరంగ సభలో ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి హాజరవ్వగా వీడియో కాన్ఫరెన్సులో జిల్లా కలెక్టర్‌తో పాటు పలువురు జిల్లా అధికారులు, స్వయం సహాయక సంఘాల మహిళలు, పెన్షన్‌దారులు వీక్షించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ పల్నాడు జిల్లాలో ఇప్పటివరకు 2,62,413 పెన్షన్‌లు ఇస్తుండగా, వాటితో పాటుగా అదనంగా 8,818 పెన్షన్లు ప్రభుత్వం పెంచి ఇస్తుందని తెలిపారు. ఇటీవలి కాలంలో కొంతమంది యువతకు ప్రభుత్వం కల్పించిన ఉద్యోగాలు, కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలు పొందిన కారణంగా వారి తల్లి దండ్రులకు పెన్షన్ అవకాశం పొందేందుకు ఇబ్బందులు వచ్చాయని అటువంటి వాటిపై పూర్తి స్థాయిలో విచారణ జరిపి అవకాశం ఉన్నంత వరకు అర్హత ఆధారంగా పెన్షన్ దార్లకు ఇచ్చే ఏర్పాటు చేస్తామని తెలిపారు. బైట వస్తున్న ప్రచారాలను, అపోహలను ప్రజలు నమ్మవద్దని హితవు పలికారు. అనంతరం కొత్త వారికి పేషన్ పథకం చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి వినాయకం, డీఆర్డీఏ పీడీ బాలు నాయక్, డీపీఓ మహాలక్ష్మి, జిల్లా మహిళా సంమాఖ్య అధ్యక్షురాలు అనూష, పలువురు జిల్లా గ్రామీణ అభివృద్ధి శాఖ అధికారులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాల పరిశీలన

విశాలాంధ్ర-బొల్లాపల్లి : వెల్లటూరు గ్రామంలో రైతులు ఆరబోసిన ధాన్యం కల్లాలను ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి ఉలవలపూడి రాము, బొల్లాపల్లి మండల కార్యదర్శి పిన్నబోయిన వెంకటేశ్వర్లుతో కలిసి పరిశీలించారు. అనంతరం రైతులతో మాట్లాడుతూ ధాన్యాన్ని ఏ విధంగా కొనుగోలు చేస్తున్నారు. తేమ శాతం ఎంత చూస్తున్నారని అడిగి తెలుసుకున్నారు. అవసరమైతే తప్ప తొందరపడి ధాన్యాన్ని తక్కువ ధరకు అమ్ముకోవద్దని, స్తోమత కలిగిన రైతులు ధాన్యాన్ని యార్డులో నిలవ పెట్టుకోవాలని, అవసరమైతే దానిపై రుణం తీసుకోవచ్చని రెండు మూడు మాసాలు ఆగగలిగితే మంచి ధర వస్తుందని రైతులతో చెప్పారు. అనంతరం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించి అధికారులతో వివరాలు అడిగి తెలుసుకున్నారు. తేమశాతాన్ని కల్లాల మీద చూసిందే ఫైనల్ చేయాలని మరల మిల్లుల వద్ద చూడొద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో కొప్పురపు మల్లికార్జునరావు, పలువురు రైతులు పాల్గొన్నారు.

జీవో 1861 రద్దు చేయాలి: బూదాల

విశాలాంధ్ర-వినుకొండ : రాష్ట్ర ప్రభుత్వం అప్రజాస్వామికంగా తీసుకువచ్చిన పోలీస్ యాక్ట్ 1861ను వెంటనే రద్దు చేసుకోవాలని లేనియెడల ప్రజాగ్రహాన్ని చవి చూడవలసి వస్తుందని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి బూదాల శ్రీనివాసరావు తీవ్రంగా విమర్శించారు. రాష్ట్ర సమితి ఇచ్చిన పిలుపుమేరకు వినుకొండ పట్టణం శివయ్య స్తూపం సెంటర్లో జరిగిన నిరసన కార్యక్రమంలో ప్రభుత్వం విడుదల చేసిన పోలీస్ యాక్ట్ 1861 జీవో కాపీలను కార్యకర్తలు దగ్ధం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ప్రజలకు ఇచ్చిన హక్కులను పోలీసులతో అణచివేయాలని చూడటం ముఖ్యమంత్రి అవివేకానికి నిదర్శనం అన్నారు. ప్రతిపక్షనేతగా ఉన్న సమయంలో ఇదే చట్టాలు ఆనాడు ప్రయోగిస్తే మీరు ప్రజల చెంతకు చేరేవారా ఒకసారి గుర్తుకు తెచ్చుకోండి అని ఆయన ప్రశ్నించారు. వెంటనే పోలీస్ యాక్ట్ 1861 రద్దు చేసుకోవాలని లేని ఎడల అన్ని రాజకీయ పార్టీలను కలుపుకొని ఉద్యమాన్ని తీవ్రతరం చేసి ప్రతిఘటిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ పట్టణ కార్యదర్శి రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఉలవలపూడి రాము, సీపీఐ నాయకులు బూదాల సాగర్, అప్పరాజు పవన్ కుమార్, షేక్ కొండ్రముట్ల చిన్న సుభాని, నూలి పుల్లయ్య, చాంద్ భాష షేక్.కరిముల్లా, కే. మల్లికార్జున, పి.వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

పథకాలకు అర్హతే ప్రామాణికం

విశాలాంధ్ర-యడ్లపాడు: సంక్షేమ పథకాలకు అర్హతే ప్రామాణికమని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖామంత్రి విడదల రజిని స్పష్టం చేశారు. మండల కేంద్రమైన యడ్లపాడులోని టీటీడీ కల్యాణ మండపంలో నిర్వహించిన పెన్షన్ వారోత్సవాల సభలో మంత్రి పాల్గొని ప్రసంగించారు. నూతనంగా 261 మంది మందికి పింఛన్లను అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గతంలోలా జన్మభూమి వంటి కమిటీలు ఉండమని, లబ్ధిదారులు ఎంపిక అర్హతే ప్రామాణికంగా జరుగుతుందని, సిఫారసులు ఎక్కడా పని చేయవని స్పష్టం చేశారు. తెలుగుదేశం నాయకులు, ప్రతిపక్షాలు చేస్తున్న ప్రచారాలు అసత్యాలని కొట్టి పారేశారు. ప్రతి పథకానికి ఆడిట్ వుంటుందని, ఇదే క్రమంలో పెన్షన్ దారుల వివరాలు సేకరిస్తున్నారని ,ఇది కేవలం ఆడిట్ కోసమేనన్నారు. ఏ ఒక్కరి పెన్షన్ రద్దు చేసే ఆలోచన ప్రభుత్వానికి లేదని నమ్మపలికారు. ప్రజలు భయపడవద్దని, తమని, ప్రభుత్వాన్ని నమ్మి మరల ఆశీర్వదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ముందుగా జ్యోతిరాయ్ పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో యడ్లపాడు ఎంపీపీ పిడతల ఝాన్సీ సాగర్, మాజీ ఎంపీపీ మద్దూరి విజయ బాలచంద్రారెడ్డి, నాయకులు కల్లూరి విజయకుమార్, కర్నాటి సుబ్బారావు, రాచమంటి చింతారావు, బసెల శివరామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సభలు, ర్యాలీలకు ఆంక్షలు కక్షపూరిత చర్యే

విశాలాంధ్ర-వినుకొండ: టీడీపీ అధినేత, మాజీ ముఖ్య మంత్రి చంద్రబాబు నాయుడు సభలకు వచ్చే జన ప్రవాహా నికి తాడేపల్లిలో ముఖ్యమంత్రి జగన్ కోటకు బీటలు వారుతున్నాయని ఆ పార్టీ పల్నాడు జిల్లా అధ్యక్షులు మాజీ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు విమర్శించారు. మంగళవారం కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో సభలు, సమావేశాలు, ర్యాలీలకు ఆంక్షలు విధించడం కక్షపూరిత చర్య అన్నారు. ఇటీవల చంద్రబాబు నిర్వహించిన రెండు సభల్లో పోలీసుల నిర్లక్ష్యం వల్లే విషాద సంఘటనలు చోటుచేసుకున్నాయ న్నారు. ఆనాడు జగన్ నిర్వహించిన పాదయాత్ర, సభల సందర్భాల్లో కూడా పలువురు చనిపోయారని గుర్తు చేశారు. లోకేష్ పాదయాత్ర చారిత్రకంగా ప్రారంభిస్తామని, ప్రభుత్వం ఎలా అడ్డుకుంటుందో చూస్తామని అన్నారు. శాసనసభ్యులు బొల్లా బ్రహ్మనాయుడు టీడీపీ హయాంలో జరిగిన పనులకు నేడు రంగులు వేయిస్తూ అంతా తనే అభివృద్ధి చేస్తున్నానని గొప్పలు చెప్పున్నాడని విమర్శించారు. 90 శాతం పూర్తయిన టిడ్కో ఇళ్లకు పది శాతం పనులు చేయించలేక అలాగే వదిలేశారన్నారు. ఎమ్మెల్యే బొల్లా రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తూ కాలక్షేపం చేస్తున్నారని విమర్శించారు. ఈ సమావేశంలో పార్టీ నాయకులు పీవీ సురేష్ బాబు, షమిమ్, దాసయ్య, వీరాంజనేయ రెడ్డి పాల్గొన్నారు.

వైభవంగా స్వామి ఉరేగింపు

విశాలాంధ్ర-వినుకొండ: ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా వినుకొండ కొండమెట్ల వద్ద వెలసియున్న శ్రీ లక్ష్మీనరసింహ స్వామి దేవస్థానం సేవకులు జాజుల మాల్యాద్రి ఆధ్వర్యంలో పట్టణ పురవీధుల నందు శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి వారి పల్లకి ఊరేగింపు వైభవంగా నిర్వహించారు. ఉదయం ఆలయ ఆవరణలో లోకకళ్యానార్థం సుదర్శన హోమాన్ని వేద పండితులు నిర్వహించారు. ముఖ్య అతిథులుగా మున్సిపల్ కమిషనర్ బి.శ్రీనివాసులు, రూరల్ సీఐ ఎస్.రమేష్ బాబు, మున్సిపల్ వైస్ చైర్మన్ రాజేష్ ఖన్నా, 16వ వార్డు కౌన్సిలర్ సానాల పుల్లయ్య, 9వ వార్డు కౌన్సిలర్ రెడ్డి నాగ పద్మ పాల్గొన్నారు బి.నరసింహం, బి.వెంకటేశ్వర్లు, రాము, రామారావు, భక్త బృందం పాల్గొన్నారు.

వైసీపీ పేదల ప్రభుత్వం

విశాలాంధ్ర-రెంటచింతల: వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పేదల ప్రభుత్వం అని మాజీ జడ్పీటీసీ నవులూరి భాస్కర్ రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం రెంటాల గ్రామంలో కొత్త మంజూరైన 15 పింఛన్లను గ్రామ సర్పంచ్ కటికల భాగ్యమ్మతో కలసి పంపిణీ చేసారు. ఈ సందర్భంగా భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ పేదలు, రైతులు రాష్ట్ర ప్రభుత్వానికి రెండు కళ్లు అని, అధికారంలోకి రాగానే రూ. 2000గా ఉన్న పింఛన్ మొత్తాన్ని ప్రతి ఏటా రూ.250 పెంచుకుంటూ పోతామన్న హామీని సీఎం జగన్ నిలబెట్టుకున్నారని పేర్కొన్నారు. ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీని తూచా తప్పకుండా పాటిస్తూ 90% పైగా అములచేసిన ఘనత సీఎం జగన్ దక్కుతుందని ఈ సందర్భంగా గుర్తు చేసారు. గత టీడీపీ ప్రభుత్వంలో పింఛన్ల కోసం అధికారుల చుట్టూ తిరిగే పరిస్థితి నుంచి వలంటీర్లు ఫించన్ దారుల ఇంటి వద్దకే ఇచ్చే పరిస్థితి వైస్సార్సీపీ ప్రభుత్వం తీసుకోచ్చిందని, పింఛన్ మొత్తాన్ని రూ. 2,500 నుంచి రూ.2,750కి పెంచి ఖర్చుకు వెనకాడకుండా లబ్దిదారుల సంక్షేమం కోసమే రాష్ట్ర ప్రభుత్వం నిబద్ధతతో పనిచేస్తోందని అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి పింఛన్ అందించడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ గాలి లక్ష్మారెడ్డి,సెక్రటరీ జి సురేష్, వెల్ఫేర్ శ్రీనివాసరావు, నవులూరి కోటి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పూలే స్ఫూర్తితో మహిళలు ముందుకు సాగాలి

విశాలాంధ్ర-పిడుగురాళ్ళ : స్త్రీ విద్యను ప్రోత్సహించిన సావిత్రిబాయి పూలే ఆశయా లను స్ఫూర్తిగా తీసుకొని మహిళలు ముందుకు సాగా లని జనసేన పార్టీ జిల్లా కార్యదర్శి దూదేకుల ఖాసీం సైదా అన్నారు. పట్టణంలోని జనసేన పార్టీ కార్యాలయంలో పూలే 192వ జయంతి సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్త్రీ అభ్యున్నతి విద్య ద్వారా మాత్రమే సాధ్యమని గ్రహించి తన భర్త జ్యోతి రావు పూలే వద్ద విద్యను అభ్యసించి మొట్టమొదటి మహిళా పాఠశాల ఏర్పాటు చేసి స్త్రీ విద్యను ప్రోత్సహించిన మాతృమూర్తి సావిత్రిబాయి పూలే అన్నారు. జిల్లా ప్రోగ్రాం కమిటీ సభ్యులు సలీం, పిడుగురాళ్ల మండల ఉపాధ్య క్షులు పెద్దకొలిమి కిరణ్, మండల కార్యదర్శి బేతంచెర్ల ప్రసాద్, రామాయణం రామయ్య, జానపాడు గ్రామ ప్రధాన కార్యదర్శి అంబటి సాయి, ఆదిత్య పాల్గొన్నారు.

వినుకొండ: భారతదేశపు మొట్టమొదటి మహిళా టీచర్ జ్యోతీరావుపూలే సతీమణి సావిత్రిబాయి పూలే జయంతిని స్థానిక బహుజన్ సమాజ్ పార్టీ కార్యాలయంలో నిర్వహించారు. ఆ పార్టీ నియోజకవర్గ సీనియర్ నాయకులు మంద సురేష్ బాబు మాట్లాడుతూ స్త్రీలను చైతన్య పరచటం కోసం 1852 లో 'మహిళా మండల్' పేరుతో సంఘాన్ని స్థాపించారన్నారు. 1873లో జోతిబాతో కలిసి 'సత్యశోధక సమాజాన్ని' నెలకొల్పి మూఢనమ్మకాలపై రాజీలేని పోరాటం చేశారన్నారు. జ్యోతీరావుపూలే 1890 నవంబరు 28న మరణించారు. తన భర్త చితికి తానే స్వయంగా నిప్పు పెట్టి కొత్త సంప్రదాయానికి తెరలేపారు. దేశంలో స్త్రీలు ధైర్యంగా తిరుగుతున్నారంటే, దాదాపు 170 ఏళ్ల తర్వాత ఆడపిల్లలు విద్యలో రాణిస్తున్నారంటే ఆ తల్లి చేసిన పోరాటాలు, ఆమె చేసిన త్యాగాలే అన్నారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ వినుకొండ పట్టణ ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎనుబరి వరప్రసాద్, పల్నాడు జిల్లా సోషల్ మీడియా కోఆర్డినేటర్, బహుజన వాలంటరీ ఫోర్స్ పట్టణ కన్వీనర్ కంభంపాటి నాగ వంశీ, పార్టీ కార్యాలయం ఇన్చార్జ్ కోట శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతున్న కూలీలకు ఆర్థిక సాయం

విశాలాంధ్ర-చిలకలూరిపేట: చిలకలూరిపేట మండలం దండమూడి గ్రామములో చికిత్స పొందుతున్న రైతు కూలీలకు జ్ఞానేశ్వర ఫౌండేషన్ చైర్మన్ షేక్ జాన్ సైదా ఆర్థిక సహాయం చేశారు. దండమూడి గ్రామ రైతు కూలీలు పెదనందిపాడు మండలం చిన నందిపాడు గ్రామములోని మొక్కజొన్న పొలములో గుళిక మందు చల్లుతూ 18 మంది ఒక్కసారిగా కుప్పకూలి పోయారు. వారిని చికిత్స నిమిత్తం గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.విషయం తెలుసుకున్న జాన్ సైదా మంగళవారం దండమూడి గ్రామముకు వెళ్లి బాధితుల ఇళ్ళకి వెళ్లి ఒక్కొక్కరికి రూ. 3 వేల చొప్పున 18 మందికి రూ.54 వేల ఆర్థిక సహాయం చేశారు. గ్రామములో ముగ్గురు దివ్యంగులకు రూ.2 వేల చొప్పున రూ.6 వేల సహాయం చేశారు. ఈ కార్యక్రమంలో 15వ వార్డు కౌన్సిలర్ జాలాది సుబ్బారావు,మానుకొండ వారి పాలెం మాజీ సర్పంచ్ కల్లి వెంకట రెడ్డి, మున్సిపల్ మాజీ ప్రతిపక్ష నేత షేక్ అబ్దుల్ రవూఫ్, గొంటు శ్రీనివాస రెడ్డి, షేక్ కరిముల్లా, మానుకొండ శేషిరెడ్డి, మోహిద్దీన్, శ్రీకాంత్ రెడ్డి,బేరింగ్ కాలేషావలి, యుసూబ్,వలి, ఇమ్రాన్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ అవార్డు అందుకోవడం గర్వకారణం

విశాలాంధ్ర-అమరావతి : రాష్ట్ర, జాతీయ స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు పొందిన మునుగోడు స్కూల్ కాంప్లెక్స్ చైర్మన్ అన్నపురెడ్డి శ్రీనివాసరెడ్డికి మంగళవారం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల బీసీ జూపూడి విద్యార్థులు, ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయనకు బోకేలు, స్వీట్లు అందజేసి పూలమాలలు వేసి దుశ్శాలువాతో సత్కరించారు. ఆయన వివిధ రంగాల్లో సేవలందించి అనతికాలంలో జాతీయ స్థాయిల్లో ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు అందుకోవడం అమరావతి మండలానికే గర్వకారణమని ప్రధానోపాధ్యాయులు బలుసుపాటి సత్యనారాయణ అన్నపురెడ్డిని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయిని ఎండీ గౌషియ సుల్తానా, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు నూతన పింఛన్ల పంపిణీ కార్యక్రమం

విశాలాంధ్ర - నిజాంపట్నం : ఈ నెల 4వ తేదీ ఉదయం 10 గంటలకు స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండలంలో నూతనంగా మంజూరైన పింఛన్లను పంపిణీ చేస్తున్నట్లు నిజాంపట్నం ఎంపీపీ మోపిదేవి విజయనిర్మల, హరినాథ్ బాబు మంగళవారం తెలిపారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా రాజ్యసభ సభ్యులు మోపిదేవి వెంకట రమణారావు పాల్గొంటారని ఆయన చేతుల మీదుగా ఈ పింఛన్లను పంపిణీ చేయనున్నట్లు ఎంపీపీ తెలిపారు. నూతనంగా పింఛన్లు మంజూరైన లబ్ధిదారులు బుధవారం ఉదయం మండల పరిషత్ కార్యాలయం వద్దకు రావాలని అయన కోరారు.

సౌత్ ఇండియన్ బ్యాంక్ | Experience Next Generation Banking | గుంటూరు బ్రాంచ్, డోర్ నెం.4-1-1, గాయత్రి ప్లాజా, కొరిటిపాడు మెయిన్‌రోడ్, గుంటూరు. ఫోన్ : 0863-2245655 ఇ-మెయిల్ : br0378@sib.co.in

బ్యాంక్ వద్ద తనఖా వుంచిన బంగారు నగల వేలము నోటీసు

ఇందుమూలముగా తెలియజేయుట ఏమనగా అధీకృత అధికారి ది సౌత్ ఇండియన్ బ్యాంక్ లిమిటెడ్ బంగారు నగలు తాకట్టు పెట్టి తీసుకున్న రుణములు ఋణగ్రహీతలకు ఎన్ని నోటీసులు జారీచేసిననూ దిగువ తెలిపినవారు తమ బాకీలను చెల్లించియుండలేదు. రుణము చెల్లించవలసిన కాలము గతించినందున సదరు బంగారు నగలను ది.04-01-2023, బుధవారం మధ్యాహ్నం 12-00 గం॥ల నుండి 3-00 గం॥ల వరకు మా బ్రాంచి ఆవరణలో ఆన్‌లైన్ వేలం ద్వారా "ఎక్కడ ఏమి ఉన్నదో అక్కడ అది" "ఎక్కడ ఎలా ఉన్నదో అక్కడ అలా" ప్రశ్నించుటకు వీలులేని అను ప్రాతిపదికన & https://egold.auctiontiger.net ద్వారా నిర్వహించబడును.

గోల్డ్ లోన్ నెం.	ఖాతాదారుని పేరు
0378653000028009, 0378653000028010	చేబ్రోలు రాజేష్, తండ్రి : రామకోటయ్య

మరింత సమాచారం కొరకు ఆక్షన్ టైగర్ 6359575981/9023724780 ను సంప్రదించగలరు.
మేనేజర్, ది సౌత్ ఇండియన్ బ్యాంక్ లిమిటెడ్

DEBTS RECOVERY TRIBUNAL

Office of the Recovery Officer-II (Department of Financial Services, Ministry of Finance, Government of India)
D.No. 31-31-21, Narayana Bhavanam, Sai Baba Street, Dabagardens, Visakhapatnam - 530020

DEMAND NOTICE

(NOTICE UNDER SECTIONS 25 TO 28 OF THE RECOVERY OF DEBTS & BANKRUPTCY ACT, 1993 AND RULE 2 OF SECOND SCHEDULE TO THE INCOME- TAX ACT, 1961).

RC/42/2022 21-11-2022

Bank of Baroda, Patnam Bazaar Branch, Guntur
Versus
M/s Venkata Krishna Cotton Traders & Others

To
(CD 1) M/s Venkata Krishna Cotton Traders, 377/A, C/o Vanadurga Ginning Mill, Mahalakshmipuram, Etukuru Road, Guntur Dist-522003
(CD 2) Smt Parimi Vijayalakshmi, W/o Venkata Rao. D.No.20-18-250, 7th lane, DS Nagar, Etukuru Road, Guntur Dist-522003
(CD 3) Sri Parimi Venkata Rao, S/o Venkata Subbaiah, D.No.20-18-250, 7th lane, DS Nagar, Etukuru Road, Guntur Dist-522003
(CD 4) Sri Parimi Brahmaiah, S/o Malakondaiah, Flat No. 104, Lavendor North, Brudavan Enclave, Etukuru Road, Guntur Dist-522003.

This is to notify that as per the Recovery Certificate issued in pursuance of orders passed by the Presiding Officer, Debts Recovery Tribunal Visakhapatnam in OA/335/2019 an amount of Rs.88,33,744.00ps. (Rupees Eighty Eight Lakhs Thirty Three Thousand Seven Hundred Forty Four Only) along with pendentellite and future interest @12.90 % p.a. with monthly rests w.e.f. 30/03/2019 till realization and costs has become due against you (Jointly and severally/ Fully/Limited). 2) You are hereby directed to pay the above sum within 15 days of the receipts of the notice, failing which the recovery shall be made in accordance with the Recovery of Debts Due to Banks and Financial Institutions Act, 1993 and Rules there under, 3) You are hereby ordered to declare on an affidavit the particulars of yours assets on or before the next date of hearing, 4) You are hereby ordered to appear before the undersigned on 02/01/2023 at 10:30 a.m. for further proceedings, 5) In addition to the sum aforesaid you will be liable to pay.- (a) such interest as is payable for the period commencing immediately after this notice of the execution proceedings; (b) all costs, charges and expenses incurred in respect of the service of this notice and other process that may be taken place for recovering the certificate amount.

Given under my hand and the seal of the Tribunal, on this date: 21/11/2022.
(B.N.S.V.S.K. BANGARRAJU)
Recovery Officer.

అర్హతే ప్రామాణికంగా ఫించన్లు మంజూరు: మంత్రి

విశాలాంధ్ర - బాపట్ల : అర్హతే ప్రామాణికంగా రాష్ట్రంలోని అర్హులందరికీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మో హన్‌రెడ్డి ఫించన్లు అందిస్తున్నారని సాంఘీక సంక్షేమ శాఖ మంత్రి మేరుగు నాగార్జున తెలిపారు. వై.ఎస్.ఆర్ పింఛన్ కానుక పంపిణీ కార్యక్రమం బాపట్ల కలెక్టరే ట్‌లోని డి.ఆర్.సి సమావేశ మందిరంలో మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో అవినీతికి తావులేకుండా ముఖ్యమంత్రి లబ్దిదారులకు నేరుగా ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నారన్నారు. రాష్ట్రంలో ఆర్థిక పరిస్థితి బాగాలేనప్పటికీ ప్రజలకు ఇచ్చిన హామీలను ముఖ్య మంత్రి అమలు చేస్తున్నారన్నారు. రాష్ట్రంలో పేద ప్రజలకు ఇచ్చిన మాటకు కట్టుబడి ప్రజలకు లక్షల కోట్లు నేరుగా అందించారన్నారు. రాష్ట్రంలో పేద ప్రజలకు ఇబ్బంది లేకుండా ప్రస్తుతం ఉన్న రూ.2500 పెన్షన్లు 2750కు పెంచారన్నారు. రాష్ట్రంలో ప్రతి నెల ఒకటవ తేదీన పెన్షన్‌దారుల ఇంటికి వెళ్లి తలుపు తట్టి డబ్బులు అవ్వా తాతలకు వాలంటీర్ల ద్వారా అందిస్తారన్నారు. జిల్లాలో 2.29 లక్షల మందికి రూ. 62.25 కోట్లు పంపిణీ చేస్తారని చెప్పారు. రాష్ట్రంలో రైతులు ఆదుకోవాలని రైతు రుణమాఫీ అమలు చేశారన్నారు. రైతులకు గిట్టుబాటు ధర కల్పించడానికి రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేశారన్నారు. అనంతరం వై.ఎస్.ఆర్.ఫించన్ కానుక మెగా చెక్కును మంత్రి మేరుగు నాగార్జున, ఎమ్మెల్సీ పోతుల సునీత, జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్, లబ్ధిదారులకు పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో డి.ఆర్.డి.ఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ అర్జున్ తదితరులు పాల్గొన్నారు.

తొలి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రిబాయి పూలే

విశాలాంధ్ర - భట్టిప్రోలు : అవమానాల నుదిక్కరించి అణగారిన ఆడపిల్లలకు అక్షరాలను నేర్పించిన తొలి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రిబాయి పూలే అని ఎంపిపి డి. లలితకుమారి అన్నారు. సావిత్రిబాయి పూలే 192వ జయంతి వేడుకలను పురస్కరించుకుని మంగళ వారం స్థానిక మండల పరిషత్ కార్యలయ ఆవరణలో జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. సావిత్రిబాయి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్ళు అర్పించారు. అనంతరం లలితకుమారి, జడ్‌పిటిసి టి.ఉదయ భాస్కరిలు మాట్లాడుతూ సావిత్రిబాయి పూలే జన్మదినోత్సవాన్ని జాతీయ మహిళా దినోత్సవంగా జరుపుకోవడం జరుగుతుందని తెలిపారు. సంఘ సంస్కర్తగా కవిగా ఉపాధ్యాయురాలుగా ఆమె చేసిన సేవలు మరువరానివన్నారు. మహిళలకు విద్యావంతులు కావాలని పాఠశాలను ఏర్పాటు చేసి మహిళలకు విద్యనందించారని చెప్పారు. సావిత్రీ బాయిపై వేధింపులకు, భౌతికదాడు లకు పాల్పడిన వెనుకడుగు వేయకుండా ముందుకు సాగారని సావిత్రి బాయి ఆశయాలను ఆదర్శంగా తీసుకుని సమాజ సేవకు ప్రతిఒక్కరూ యుందుకు రావాలని లలితకుమారి కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ జి. చంద్రశేఖర్, మండల పరిషత్ ఉపాధ్యక్షులు కౌతరపు పిచ్చయ్య శాస్త్రి, వైసిపి నాయకులు జి. చినబుజ్జి, నాగమల్లేశ్వరరావు. టి.బాలాజీ పాల్గొన్నారు.

పేదలకు ద్రోహం చేస్తున్న వైసీపీ ప్రభుత్వం

విశాలాంధ్ర-నూజెండ్ల : పల్నాడు జిల్లా టీడీపీ అధ్యక్షులు, వినుకొండ మాజీ శాసనసభ్యులు జీవీ ఆంజనేయులు ఆదేశాల మేరకు నూజెండ్ల మండలం త్రిపురాపురం గ్రామంలో ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమాన్ని సోమవారం నూజెండ్ల మండల టీడీపీ అధ్యక్షులు మీసాల మురళి యాదవ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అర్హులైన వృద్ధులు, వికలాంగులు, వితంతువులు, ఒంటరి మహిళ పెన్షన్లను ఎత్తివేసి, రేషన్ కార్డులు తొలగింపులతో పేదలకు ద్రోహం చేస్తున్న వైసీపీ అసమర్ధ అరాచక పాలనతో మన రాష్ట్రానికి ఇదేమి ఖర్మ అంటూ ప్రజలు విసిగిపోయి చీకొడుతున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ అనుముల సుబ్బారెడ్డి, రొద్దా వీరాంజనేయరెడ్డి, కుంటా కోటిరెడ్డి, గ్రామ పార్టీ అధ్యక్షులు గుంజరి పున్నయ్య, తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పింఛన్ల పంపిణీలో నూతన ఒరవడికి నాంది

విశాలాంధ్ర - పిట్టలవానిపాలెం, కర్లపాలెం : సామాజిక పెన్షన్ల పంపిణీలో సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి నూతన వరవడికి శ్రీకారం చుట్టారని బాపట్ల ఎమ్మెల్యే కోన రఘుపతి అన్నారు.మండలంలోని కర్లపాలెం, ఖాజీపాలెం మంతెన సుబ్బరామరాజు జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో మంగళవారం ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా అయన పాల్గొని ప్రభుత్వం పెంచిన సామాజిక పెన్షన్లు లబ్దిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సంక్షేమమే ధ్యేయంగా సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి రాష్ట్రంలో ప్రజారంజక పాలనను అందిస్తున్నారని చెప్పారు.ఇచ్చిన మాట ప్రకారం సీఎం వైఎస్ జగన్మోహన్రెడ్డి విడతల వారీగా పింఛను సొమ్ము పెంచుతున్నారని, మూడవ సారి న్యూ ఇయర్ కానుకగా మరో రూ.250 పెంచి ప్రస్తుతం రూ.2.750 నగదు అందిస్తున్నారన్నారు.అర్హత ఉంటే చాలు పార్టీలకు అతీతంగా పింఛన్లు మంజూరు చేసిన ఘనత సీఎం జగనన్నకే దక్కుతుందన్నారు. అనంతరం 8వ తరగతి విద్యార్థులకు ట్యాబ్లు పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎంపీపీలు యారం వనజ, షేక్ బాజీ, జడ్పీటీసీలు పిట్ల వేణుగోపాల్‌రెడ్డి, గోవతోటి సురేఖవిజయ్, కర్లపాలెం సర్పంచ్ బొద్దుకూరి విజయ, మండల కన్వినర్ దొంతిబోయిన సీతారామిరెడ్డి, బాపట్ల మార్కెట్ యార్డ్ డైరెక్టర్ మండే విజయ్ కుమార్, బాపట్ల మార్కెట్ యార్డ్ వైస్ ప్రెసిడెంట్ ఉయ్యూరు లీల శ్రీనివాస్ రెడ్డి ,వైస్ ఎంపీపీ రామరాజు, ఖాజీ పాలెం సర్పంచ్ అనుష ప్రసన్న, ఎంపీడీవో పద్మజా, సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

CHANGE OF NAME

I, NALLAMALLI PURNA SARAVANI (Old Name), W/o. BATHULA VARUN, R/o. D.No. 7-9-8, Kakumanu Bazar, Narasaraopet, Guntur District (present Palnadu District), A.P., have changed my name to BATHULA PURNA SRAVANI. Hereafter my name is known as BATHULA PURNA SRAVANI.

సీఎం జగన్‌కు ఎస్పీ శుభాక్షాంక్షలు

విశాలాంధ్ర - బాపట్ల : ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డికి ఎస్పీ వకుల్‌జిందాల్ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. సీఎం క్యాంప్ కార్యాలయంలో మంగళవారం సీఎం జగన్‌కు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

ఎస్టీయూ క్యాలెండర్, డైరీ ఆవిష్కరణ

విశాలాంధ్ర-కొల్లూరు : రాష్ట్రోపాధ్యాయ సంఘం ఎస్టీయు నూతన సంవత్సర క్యాలెండర్, డైరీ ఆవిష్కరణ కార్యక్రమం సోమవారం కొల్లూరులోని విద్యా వనరుల కేంద్రంలో నిర్వహించారు. మండల ఇన్‌చార్జి ఎంఈఓ కాజ లక్ష్మినారాయణ క్యాలెండర్లు, డైరీలను ఆవిష్కరించి ఉపాధ్యాయులకు అందజేశారు. ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయ సమస్యల పరిష్కారం కోసం ఎస్టీయు ఎనలేని పోరాటం చేస్తుందని అన్నారు. ఎస్టీయు నాయకులు పి.యాకోబు, బి.శ్రీనివాసరావు, జి.రాజేంద్ర, బి.సర్వోన్నత రావు, పి.వెంకటేశ్వరరావు, బి.నాగేశ్వరరావు, ఎస్ఎస్. రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మహారాజ శ్రీ సీనియర్ సివిల్ జడ్జి గురజాల వారి కోర్టు
E.P 6/2021 IN O.S 212/2017

బిట్వీన్ :
ముండ్లపాటి వెంకట్రావు - D.H.R
మరియు
ఓర్సు వెంకటేశ్వర్లు - J.D.R

పై నంబరు E.P నందు J.D.R కు చెందిన దిగువ షెడ్యూలు ఆస్తిని ది. 18.01.2023వ తేదీన వేలం వేయుట ద్వారా D.H Rకి రావలసిన బాకీని రాబట్టుటకు కోర్టు వారు నిర్ణయించినందున వేలం తేదీ ఉదయం 10.30 గంటలకు వేలం పాటలో పాల్గొనదలచిన వారు శ్రీ కోర్టు వారి ఎదుట హాజరై కోర్టు వారి షరతులకు లోబడి వేలం పాటలో పాల్గొనగలరు. షెడ్యూలు : గుంటూరు జిల్లా, నరసరావుపేట రిజిస్ట్రేషన్ జిల్లా, పిడుగురాళ్ల ఎస్.ఆర్.ఓ, లిమిట్స్, గంగిరెడ్డిపాలెం గ్రామపంచాయతీ, మాచవరం గ్రామంలో డి. నెంబర్ : 284 నందు ఎక.8-40 సెంట్లలో ఎక 1-50 సెంట్ల శేరి మేరక భూమికి హద్దులు :
తూర్పు : గుడే వెంకటేశ్వర్లు భూమి
దక్షిణం : ఓర్సు నాగభూషణం భూమి
పడమర : బత్తుల ఎల్లమంద భూమి
ఉత్తరం : డి.హెచ్.ఆర్ భూమి
వేలం తేదీ : 18-01-2023.
డి.హెచ్.ఆర్ విలువ : 7,00,000/-
అమీనా విలువ : 12,00,000/-

చల్లా రామిరెడ్డి, ఎస్.శ్యామలాదేవి
డి.హెచ్.ఆర్ తరపు న్యాయవాదులు
సెల్ నెంబర్ : 9441409796.

బహిరంగ ప్రకటన

గుంటూరు జిల్లా, తెనాలి టౌన్, ఐతానగర్, డోరు నెం.4-12-1రు కాపురస్తులు జమ్ముల వెంకటసుబ్బయ్య గారి కుమారుడు జమ్ముల అయ్యన్న గారి సంజాయిషీ పొంది యావన్మందికి తెలియజేయునది.

గుంటూరు జిల్లా, తెనాలి టౌన్, టియస్ నెం.91 నందలి చ.గ. 387-2 లు స్థలము అందలి డోరు నెం.4-54-118రు గల ఇల్లు ఆస్తిలో సగభాగము వాటాపై నా క్లయింటుకు హక్కు కలదు. మరో సగము వాటా ఆస్తి నా క్లయింటు భార్య జమ్ముల వసంత కుమారి గారికి సోదరియైన రావి సుధామయి గారికి కుమార్తెలయిన మాదల రాధామాధవి, చల్లపల్లి హరిత గార్లకు చెందినది. నా క్లయింటుకు వారి భార్య జమ్ముల వసంత కుమారి గారి నుండి అన్ రిజిష్టరు వీలునామా ద్వారా మరియు మాదల రాధామాధవి, చల్లపల్లి హరిత గార్లకు వారి తల్లిదండ్రుల మరణానంతరం ఆస్తి సంక్రమించినది. కాగా సదరాస్తి యొక్క లింకు దస్తావేజు అనగా ది.20-07-1941న చిటేలు లక్ష్మమ్మ (భర్త: చిటేలు తిరుపతిరాయుడు) పేరిటకు తెనాలి ఎస్ఆర్ఓ నందు రిజిష్టరైన విక్రయ దస్తావేజు నెం.1941/1941ను తీసుకుని ది.03.11.2022న గుంటూరు సిటీ, గోరంట్లలోని నా క్లయింటు బంధువుల ఇంటికి సదరాస్తి విక్రయ నిమిత్తం వచ్చినారు. అనంతరం అక్కడి నుండి గోరంట్ల సెంటర్‌కు ద.నెం.1941/1941ను జిరాక్సు తీయించే నిమిత్తం ఆటోలో వెళ్లుచుండగా పోయినదని తెలియజేసినారు.

కావున ఈ దస్తావేజు ఎవరికైనా దొరికినా, సదరు ఆస్తిపై విషయమై ఎవరికైనా అభ్యంతరములు ఉన్న యెడల నాకు గానీ, నా క్లయింటుకు గానీ ఈప్రకటన ప్రచురితమైన తేదీ నుండి 15 రోజులలోగా తెలియజేయగలరు.

బి.యు.వి. నాగేశ్వరరావు, అడ్వకేట్, నోటరీ
బ్రాడీపేట, గుంటూరు. సెల్: 8074995457

రోడ్ షోలపై జీఓ దుర్మార్గం

విశాలాంధ్ర-సత్తెనపల్లి : రాష్ట్రంలో ర్యాలీలు, బహిరంగ సభలు, సమావేశాలు, రోడ్ షోలు జరపకూడదని రాష్ట్ర ప్రభుత్వం జీవో ఇవ్వడం దుర్మార్గమని న్యాయవాది, సీపీఐ పల్నాడు జిల్లా కార్యవర్గ సభ్యుడు నరిశెట్టి వేణుగోపాల్ అన్నారు. మంగళవారం ఆయన విలేఖరులతో మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి కనుసన్నల్లోనే పౌరులకు భారత రాజ్యాంగం కల్పించిన భావస్వేచ్ఛ, వ్యక్తీకరణ, ప్రాథమిక హక్కులను హరించే నియంతృత్వ, అరాచకపాలన ఏపీలో కొనసాగుతుందన్నారు. జగన్ పాలనలో అభివృద్ధి శూన్యమని పరిపాలన గాడితప్పిందన్నారు. స్టేట్ స్పాన్సర్డ్ టెర్రరిజం కొనసాగుతుందన్నారు. ప్రజాసమస్యలపై స్పందించే వారిపై, పోరాడే ప్రతిపక్షాలు, ప్రజాసంఘాలపై రాజ్యహింసకు పాల్పడుతూ అణిచివేసే ప్రయత్నం చేయడం దుర్మార్గమన్నారు. ప్రజల ఆకాంక్షలు, రాష్ట్ర సమగ్రాభివృద్ధి మరచి ఆర్థిక అరాచకాలకు, ప్రశ్నించేవారిపై అక్రమ కేసులు, దాడులకు పాలకులు పాల్పడే హీన స్థితికి దిగజారడం శోచనీయమన్నారు. కందుకూరు, గుంటూరు ప్రమాద ఘటనలను సాకుగా చూపి జగన్ సర్కార్ ప్రభుత్వంపై ప్రజల వ్యతిరేకత, ఆగ్రహం, బహిరంగంగా వ్యక్తం కాకూడదనే కుట్రలో భాగంగానే ఈజీఓ, పోలీస్ యాక్ట్ ఉత్తర్వులన్నారు. ప్రత్యేక పరిస్థితుల్లో సభలు పెట్టుకోనేందుకు అనుమతులు ఇస్తామంటున్నారని, ఈ ప్రత్యేక పరిస్థితులు వైసీపీకి మాత్రమే వర్తిస్తాయా? అని ప్రశ్నించారు. అప్రజాస్వామికమైన ఈ జీఓను తక్షణమే ఉపసంహరించుకోవాలని సీపీఐ డిమాండ్ చేస్తుందని చెప్పారు.

ఆంక్షలు ప్రభుత్వ కుట్రలో భాగమే: శేషయ్య

విశాలాంధ్ర-గుంటూరు కార్పొరేషన్: టీడీపీ కార్యక్రమాలకు ప్రజల్లో వస్తున్న స్పందనను చూసి జీర్ణించుకోలేక ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి కుట్రపూరితంగా ర్యాలీలు, సభలపై ఆంక్షలు విధిస్తూ జీవో నెం.01 జారీ చేసిందని గుంటూరు టీడీపీ పశ్చిమ నియోజకవర్గ నాయకులు, ఏపీ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు డాక్టర్ నిమ్మల శేషయ్య అన్నారు. మంగళవారం స్థానిక గుజ్జనగుండ్లలోని ఆయన కార్యాలయంలో మాట్లాడారు. రాజ్యాంగం కల్పించిన భావవ్యక్తీకరణ స్వేచ్ఛను కూడా హరించే విధంగా జగన్ ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలకు దిగుతోందన్నారు. ఏపీ నియంతరాజ్యం కాదని జగన్‌మోహన్ రెడ్డి గుర్తుంచుకోవాలన్నారు. ప్రభుత్వం తెచ్చిన ఈ ఉత్తర్వులతో ఇకపై నిరసన కార్యక్రమాలను పల్లెల్లోని పొలాలు, కాలువలు, చెరువుల్లో నిర్వహించాలేమో అని ఎద్దేవా చేవారు. ఇలాంటి ఉత్తర్వులు గతంలో ఉంటే దేశానికి స్వాతంత్ర్యం వచ్చుండేది కాదేమో అప్పట్లో గాంధీ మహాత్ముడు చేసిన పోరాటాలన్నీ రోడ్లపైనే జరిగాయి. ప్రభుత్వ ఉత్తర్వులను ఉపేక్షించం..తాడోపేడో తేల్చుకొని ప్రజల పక్షాల నిలుస్తామని అన్నారు. తొక్కిసలాట ఘటనల వెనుక కుట్ర ఉందనే అనుమానం కలుగుతోందన్నారు. ప్రజా సమస్యలపై తెలుగుదేశం పార్టీ పోరాటం కొనసాగుతుంది. ప్రజలకు అండగా నిలుస్తుందన్నారు.

అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : తూర్పు నియోజకవర్గంలో చేయనున్న అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని ఎమ్మెల్యే మహమ్మద్ ముస్తఫా నగరపాలక సంస్థ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం ఎమ్మెల్యే ముస్తఫా కార్యాలయంలో ఇంజనీరింగ్ అధికారులతో సమావేశమై నియోజకవర్గంలోని పలు అభివృద్ధి పనులుపై చర్చించారు. గత కౌన్సిల్ సమావేశంలో తీర్మానించిన అభివృద్ధి పనులకు ప్రతిపాదనలు ఎందుకు తయారు చేయలేదని అధికారులను ప్రశ్నించారు. అదేవిధంగా గడపగడపకు మన ప్రభుత్వంలో వచ్చిన పనులకు టెండర్ల వరకు వచ్చి ఎందుకు ఆగాయని ప్రశ్నించారు. బస్టాండ్ ఎదుట మణిపురం వంతెన వద్ద డ్రెయిన్ నిర్మించాలని గతంలో చెప్పిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. సామాజిక భవనాల నిర్మాణాలపై ప్రతపాదనలు సిద్ధం చేసి టెండర్లు పూర్తి చేయాలని ఆదేశించారు. పాతగుంటూరు రాజీవ్‌గృహ కల్ప రోడ్డులో సీసీరోడ్డు నిర్మించాలని, 51వ డివిజన్ మాలకొండయ్య కాలనీలో అభివృద్ధి పనులు ప్రారంభించలేదని దుయ్యబట్టారు. ఓల్డ్‌క్లబ్ రోడ్డులో అసంపూర్తిగా కల్వర్టు పనులు చేశారని, 13వ డివిజన్‌లోని బాపూజీ రోడ్డు, రెడ్లబజారులో విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయాలని తదితర పెండింగ్ పనులు పూర్తి చేయాలన్నారు. 57వ డివిజన్ గణేష్‌నగర్‌లో, 54వ డివిజన్‌లో అభివృద్ధి పనులు చేయాల్సి ఉందన్నారు. ఈ సమావేశంలో ఈఈ కోటేశ్వరరావు, డీఈ శ్రీనివాసరెడ్డి, ఏఈలు రాంబాబు, సేతుబాబు, అనూష తదితరులు పాల్గొన్నారు.

పేదలకు సామాజిక పెన్షన్లు ఓ వరం

విశాలాంధ్ర-దుర్గి : రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పెన్షన్ పథకాన్ని రూ.2500 నుంచి రూ.2750 పెంచి అర్హులైన పేదలకు అందించడం రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అందిస్తున్న వరమని ఎంపీపీ యేచూరి సునీత సాయి శంకర్, యార్డు ఛైర్మన్ వెలిదండి గోపాల్ అన్నారు. పెన్షన్ వారోత్సవాల్లో భాగంగా మండల కేంద్రమైన దుర్గిలో నూతనంగా అవ్వాతాతలకు మంజూరైన పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో వారు పాల్గొని మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం నూతన సంవత్సరం సందర్భంగా దుర్గి మండలానికి నూతనంగా 366 పెన్షన్లు మంజూరు చేశారని చెప్పారు. పాదయాత్రలో జగన్‌మోహన్ రెడ్డి ఇచ్చిన ప్రతి మాటను నెరవేర్చుకున్నారని, ఆయనకు రాబోయే ఎన్నికల్లో ప్రతిఒక్కరూ అండదండగా నిలవాలని కోరారు. అనంతరం నూతనంగా మంజూరైన పెన్షన్లను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. మండల వ్యాప్తంగా మంగళవారం ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు నూతన పెన్షన్‌దారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు తోటకూర నాగేశ్వరరావు, చాట్ల శాంతరమేష్, గంగారపు లక్ష్మీ వెంకటరెడ్డి, మమ్ము శివరామకృష్ణ, ఉన్నం రమణ, ఎంపీటీసీ సభ్యులు పసుపులేటి వెంకట్రామయ్య, కటకం గోపాల్, వైసీపీ నాయకులు కటకం చినవెంకటయ్య, గోసుల హోను మయ్య, కట్టెబోయిన రవి, బుచ్చిబాబు, తోటకూర వెంకటేశ్వర్లు, పంచాయతీ కార్యదర్శులు వై.వెంకటేష్, ఆర్ఎండి హఫీజ్ తదితరులు పాల్గొన్నారు.

108 ఉద్యోగుల హామీలు నెరవేర్చాలని వినతి

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : అంబులెన్స్ 108 వాహనాల్లో పని చేస్తున్న ఉద్యోగులకు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని కోరుతూ 108 వాహన ఉద్యోగులు మంగళవారం ఎమ్మెల్యే మహమ్మద్ ముస్తఫాను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా 108వాహనాల ఉద్యోగులు మాట్లాడుతూ 108వాహనాల ఉద్యోగులకు వేతనాలు నెలల తరబడి ఆలస్యం అవుతున్నాయని ఆవేదన వ్యక్తంచేశారు. ప్రతి నెల ఇవ్వాల్సిన వేతనాలు అరబిందో సంస్థ ఆలస్యం చేయటంతో ఇబ్బందులు పడుతున్నట్టు ఎమ్మెల్యే ముస్తఫాకు తెలియజేశారు. చిన్నచిన్న కారణాలకు కూడా విచారణ లేకుండా బదిలీలు, సస్పెన్షన్లు చేస్తున్నారని, అనేకమంది ఉద్యోగులు యాజమాన్యం కారణంగా విధులకు దూరంగా ఉన్నారన్నారు. అనేకసార్లు సంస్థ ప్రతినిధులతో చర్చలు జరిపినపుడు అమలు చేయకుండా దాటవేత ధోరణితో వ్యవహరిస్తున్నారన్నారు. గతంలో ఇచ్చిన హామీలను ప్రభుత్వం అమలుపరచాలని వారు కోరారు. అరబిందో సంస్థ తొలగించిన ఉద్యోగులను విధుల్లోకి తీసుకోవాలని, ప్రతి నెల 5వ తేదీ లోపు వేతనాలు చెల్లించే విధంగా చూడాలని కోరారు. కార్మిక చట్టాలను అనుసరించి 108వాహనాలు అత్యవసర సేవలకు మాత్రమే వినియోగించేలా నిబంధనలు రూపొందించాలని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో హుస్సేన్, శివశంకరరావు తదితరులు పాల్గొన్నారు.

స్త్రీ విద్యాభివృద్ధికి కృషి చేసిన తొలితరం మహిళా సావిత్రిబాయి: ఎస్టీయూ

విశాలాంధ్ర-గుంటూరు : సమాజంలోని కులతత్వం, పురుషాధిక్యత ధోరణులు కలిగిన చాలామంది పండిత మేధావులందరికీ కూడా సావిత్రిబాయి కేవలం జ్యోతిరావు పూలే భార్యగా మాత్రమే తెలుసని. కానీ సావిత్రిబాయి ఆధునిక భారతదేశంలో మొట్టమొదటి మహిళా ఉపాధ్యాయురాలు, పీడిత ప్రజలు ముఖ్యంగా స్త్రీల విద్యాభివృద్ధికి కృషి చేసిన తొలితరం మహిళా ఉద్యమకారిణి.. స్త్రీల విముక్తి కోసం అహర్నిశలు శ్రమించిన నాయకి, గొప్ప రచయిత్రి అని ఎస్టీయూ రాష్ట్ర పూర్వ అధ్యక్షులు సీహెచ్ జోసెఫ్ సుధీర్ బాబు తెలిపారు. సంఘసంస్కర్త సావిత్రిబాయి పూలే 192వ జయంతి సందర్భంగా గుంటూరు ఎస్టీయూ భవన్‌లో సావిత్రిబాయి పూలే జయంతిని గుంటూరు జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు గేరా మోహనరావు అధ్యక్షతన ఏర్పాటు చేయబడిన సమావేశంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న జోసెఫ్ సుధీర్ బాబు మాట్లాడుతూ మంచి వక్త.. కులం, పితృస్వామ్యంపై కలం యుద్ధం నడిపిన కవయిత్రి.. యుక్తవయసులోనే తన సౌఖ్యాలను వదులుకొని శూద్రులకు, దళితులకు పాఠశాలలు నడిపిన గొప్ప మానవి. స్త్రీపురుషులు కులమతాలకతీతంగా విద్యనభ్యసించడం సహజమైన హక్కు ఉంటుందని, అందుకే అందరూ చదవాలి... అందరూ సమానంగా బ్రతకాలి... అని అనునిత్యం తపించిన సామాజిక విప్లవ మాతృమూర్తి సావిత్రిబాయి అని కొనియాడారు. ఎస్టీయూ రాష్ట్ర మహిళా కన్వీనర్ సిహెచ్ ఉమా మాట్లాడుతూ ప్రపంచ చరిత్రలోనే భర్తతోపాటు ఉద్యమ జీవితంలో కలిసి నడిచిన ఆదర్శ సహచరిగా సావిత్రిబాయి నిలిచిపోయిందన్నారు. సావిత్రిబాయి తన వ్యక్తిగత జీవితాన్ని త్యాగం చేసి విద్యాబోధనకు, బాలికలకు అంకితమైందని చెప్పారు. ఈ సందర్భంగా మహిళా ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి చందా నరసింహారావు, ఆర్థిక కార్యదర్శి సిహెచ్ వెంకటేశ్వరరావు, ఉపాధ్యాయ వాణి కన్వీనర్ షేక్ బాజీ, రాష్ట్ర కౌన్సిలర్లు కొరివి అనిల్ కుమార్, ఎంపీ సుబ్బారావు, డీఏ జోసెఫ్, నాయకులు డీవీ సుబ్బారావు, జి.జోజప్ప, మొగలి శ్రీనివాసరావు, బి.కృష్ణ కిషోర్, సోలార్ బేగ్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో కొత్తగా 8300 పెన్షన్లు మంజూరు : కలెక్టర్

విశాలాంధ్ర-గుంటూరు కార్పొరేషన్: జిల్లాలో క్రొత్తగా 8300 పెన్షన్లు మంజూరు చేయడం జరిగిందని జిల్లా కలెక్టర్ వేణుగోపాల్ రెడ్డి తెలిపారు. మంగళవారం కలక్టరేట్ శంకరన్ హాల్‌లో వైయస్సార్ పెన్షన్ కానుక పెంపుదల వారోత్సవాల కార్యక్రమంలో కలెక్టర్ వేణుగోపాల్ రెడ్డి, అసిస్టెంట్ కలెక్టర్ శివనారాయణ శర్మ, ఎమ్మెల్యేలు మహమ్మద్ ముస్తఫా, మద్దాలి గిరిధర్ రావు, డాక్టర్ ఉండవల్లి శ్రీదేవి, రాష్ట్ర కుమ్మరి, శాలివాహన కార్పొరేషన్ చైర్మన్ ఎం. పురుషోత్తం, నగరపాలక సంస్థ డిప్యూటీ మేయర్ సజీలా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడతూ జిల్లాలో వైయస్సార్ పెన్షన్ కానుక ద్వారా సంవత్సరానికి రూ.845 కోట్లు ఖర్చు చేసి పేద ప్రజలకు ప్రభుత్వం ఆర్థిక భరోసా కల్పిస్తుందని అన్నారు. జనవరి 1వ తేది నుండి వైయస్సార్ ఫించన్ కానుక ద్వారా జిల్లాలో అభయ హస్తం పెన్షన్, వృద్ధులు, వితంతువులు, చేనేత కార్మికులు, కల్లుగీత కార్మికులు, ఒంటరి మహిళలు, మత్స్యకారులు, చర్మకారులు, ఎయిడ్స్ వ్యాధిగ్రస్తులు, వికలాంగులు, ట్రాన్స్ జెండర్స్, డప్పు కళాకారులు, కిడ్నీ, తలసేమియా వ్యాధిగ్రస్తులు మొత్తం 2,56,551 మంది లబ్ధిదారులకు ఐదు వందల రూపాయల నుండి పది వేల రూపాయల వరకు అందిస్తూ నెలకు మొత్తం రూ.70.48 కోట్లు చెల్లించడం జరుగుతుందని అన్నారు. రాజమహేంద్రవరం ఆర్ట్స్ కళాశాల ప్రాంగణంలో ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి వై.యస్.ఆర్ పింఛను కానుక పెంపుదల వారోత్సవాల కార్యక్రమం ప్రత్యక్ష ప్రసారాన్ని గుంటూరు కలక్టరేట్ శంకరన్ హాల్ నుండి వీక్షించడం జరిగింది. కార్యక్రమం అనంతరం 2,56,551 మంది లబ్ధిదారులకు రూ.70,48,17,250ల చెక్కును పంపిణీ చేసారు. కార్యక్రమంలో ఆర్డిఓ ప్రభాకర రెడ్డి, డీఆర్డీఏ పీడీ హరిహరనాథ్, మెప్మా పీడీ వెంకటనారాయణ, సచివాలయ సిబ్బంది లబ్ధిదారులు పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ మహాసభ విజయవంతంచేయాలి

విశాలాంధ్ర-వినుకొండ: నియోజకవర్గం ఎమ్మార్పీఎస్ సమావేశం మాజీ ఎమ్మెల్యే జీవి ఆంజనేయులు నివాసంలో నిర్వహించారు. జనవరి 11న బెంగళూరులో నిర్వహించే ఎమ్మార్పీఎస్ జాతీయ మహాసభను విజయవంతం చేయాలని వినుకొండ నియోజకవర్గం ఇన్చార్జి చిరుగురి నాగరాజు మాదిగ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సామాజిక న్యాయాన్ని అమలు చేయలేని పాలకులు దేశ ద్రోహులన్నారు. ఎస్సీ వర్గీకరణను మించిన సామాజిక న్యాయం లేదన్నారు. భారత రాజ్యాంగం దేశ ప్రజలకు సామాజిక, ఆర్థిక,రాజకీయ న్యాయాన్ని అందించాలని నిర్దేశిస్తుందని, కానీ పాలకులు అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారని అన్నారు. అంబేద్కర్ రాజ్యాంగం ద్వారా రిజర్వేషన్ ఫలాలను మాదిగ ఉప కులాలను అందించే విధంగా వర్గీకరణ అమలు చేయాలని మాదిగలు పోరాటం చేస్తున్నారని అన్నారు. దేశాన్ని పాలిస్తున్న బీజేపీకి చిత్తశుద్ధి, నిబద్ధత ఉంటే శీతాకాల పార్లమెంట్ సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ బిల్లు పెట్టి సామాజిక న్యాయాన్ని అమలులోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు. బీజేపీ మెడలు వంచేందుకు మాదిగ ప్రజలంతా మరో పోరాటానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. అందుకోసం పూర్తి స్థాయిలో మాదిగ యువకులతో ఎమ్మార్పీఎస్, గ్రామ, మండల నూతన కమిటీలను తక్షణమే ఏర్పాటు చేయాలని పిలుపునిచ్చారు. ఎమ్మార్పీఎస్‌ను సంస్థాగత నిర్మాణం పూర్తి చేసుకొని జనవరి 11న బెంగుళూరులో జరిగే జాతీయ మహాసభను పెద్ద ఎత్తున కార్యకర్తలు పాల్గొనాలని కోరారు.

పింఛన్ నిలిపివేశారంటూ వృద్ధుడి ఆందోళన

విశాలాంధ్ర-విజయపురిసౌత్: గ్రామ సర్పంచ్ తనపై కక్ష్య పెంచుకొని పింఛన్ నిలిపివేశాడని గిరిజన వృద్ధుడు ఆవేదన చెందిన సంఘటన మాచర్ల మండలం చింతల తండాలో మంగళవారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే చింతల తండాకు చెందిన కేతావత్ నార్య నాయక్ గత రెండు సంవత్సరాలుగా పింఛన్ పొందుతున్నాడు. అయితే గ్రామ సర్పంచ్ కేతావత్ శ్రీను నాయక్ కు నార్య నాయక్ మధ్య ఇటీవల ఓ విషయం పై వాదన జరిగిందని, దీనితో సర్పంచ్ తనపై కక్ష్య పెంచుకొని ఉద్దేశ్య పూర్వకంగా పింఛన్ నిలిపివేయించాడని బాధితుడు వాపోయాడు. మూడు రోజులు గా పింఛన్ ఎందుకు ఇవ్వలేదని వాలంటీర్‌ను అడిగితే సర్పంచ్ ను కలవాలని సమాధానం చెప్తున్నాడని, సర్పంచ్ వద్ద పలుసార్లు మొకరిల్లినా పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశాడు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి తనకు న్యాయం చేయాలని బాధితుడు కోరాడు.

పెన్షన్ ఇప్పించండి సారూ...

విశాలాంధ్ర-చెరుకుపల్లి: విద్యుత్ వినియోగం ఎక్కువగా ఉందన్న సాకుతో తన పెన్షన్ నిలిపివేశారని కడు పేదరాలినైన తనకు వెంటనే ఫంక్షన్ మంజూరు చేయాలంటూ చెరుకుపల్లికి చెందిన పెంద్ర వెంకటమ్మ అనే మహిళ ఎంపీడీవో కార్యాలయం ఎదుట నిరసన తెలియజేసింది. మంగళవారం మధ్యాహ్నం ఆమె కార్యాలయం ముందు కూర్చుని గత సంవత్సరకాలంగా తనకు నూరు శాతం వికలాంగులు అయిన తన కుమారుడికి పెన్షన్ నిలిపివేశారని వెంటనే తమకు పెన్షన్ మంజూరు చేయవలసిందిగా సంవత్సరం నుండి అధికారులను వేడుకుంటున్నప్పటికీ తనను ఎవరు కనికరించలేదని ఆవేదన వ్యక్తం చేసింది. తనకు నివాసముండేందుకు సొంత ఇల్లు కూడా లేదని, పిల్లలందరూ పెళ్లి చేసుకుని ఎవరి దారిన వారు బతుకుతున్నారని, వితంతురాలైన తనకు పెన్షన్ జీవనాధారం అని కన్నీటి పర్యంతమవుతూ అధికారులకు విన్నవించుకుంది. ఆమెకు సంఘీభావంగా మండల సిపిఎం కార్యదర్శి కే శరత్ ఆమె తరపున అధికారులతో వాగ్వాదానికి దిగాడు. దీనిపై మండల అభివృద్ధి అధికారి మాట్లాడుతూ ఆమె పెన్షన్ పునరుద్ధరణకు ప్రభుత్వ పరిధిలో చేయవలసిన ప్రయత్నం చేస్తానని ఆయన అన్నారు.

ఎక్కడా లేని పథకాలు ఏపీలో అమలు

విశాలాంధ్ర- నూజెండ్ల : దేశవ్యాప్తంగా ఏ రాష్ట్రంలో అమలు చేయని సంక్షేమ పథకాలను ఒక్క మన రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అమలు చేస్తున్నారని శాసనసభ్యులు బొల్లా బ్రహ్మనాయుడు అన్నారు. మండలంలోని నూతనంగా మంజూరైన పింఛన్లను ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు పంపిణీ చేశారు. మంగళవారం పింఛన్ల వారోత్సవాలలో భాగంగా మండల కేంద్రమైన నూజండ్లలో నూతన పింఛనర్లకు తన చేతుల మీదుగా పంపిణీ చేశారు. అనంతరం ఎమ్మెల్యే బొల్లా మాట్లాడుతూ పేదలకు మంచి చేయాలన్న ఏకైక లక్ష్యంతో ముందుకు వెళ్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిపై ప్రభుత్వంపై ప్రతిపక్షాలు కుట్రలు చేస్తున్నాయని అర్హత ఉన్న ఏ ఒక్కరి పింఛన్ కూడా తొలగించడం లేదని స్పష్టం చేశారు. రాష్ట్రంలో జగన్‌మోహన్ రెడ్డి సీఎం అయ్యాక పెద్దఎత్తున సంక్షేమ పథకాలు అందిస్తున్నామన్నారు. ఎక్కడా వివక్ష చూపకుండా పార్టీలకు అతీతంగా పథకాలు నేరుగా గడప వద్దకే చేర్చామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ మేడమ్ జయరామిరెడ్డి, జడ్పీటీసీ సభ్యులు జడ్డా సుబ్బులు రామయ్య, మండల పరిషత్ అభివృద్ధి అధికారి షేక్ జలాని భాష, మండల కన్వీనర్ నక్కా నాగిరెడ్డి, యార్డ్ చైర్మన్ బత్తుల చిన్నబ్బాయి, నూజెండ్ల సొసైటీ చైర్మన్ పొట్లపల్లి పిచ్చిరెడ్డి, యార్డ్ వైస్ చైర్మన్ కొమరిశెట్టి రామారావు, ఏపీవో కట్టా నాగేశ్వరరావు, సర్పంచులు ఈపనేగుంట్ల అంజమ్మ, కంచర్లబాబు, పరిమి శేషు, శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

మాటకు కట్టుబడిన నాయకుడిగా జగన్

విశాలాంధ్ర-వినుకొండ: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి పాద యాత్రలో ఇచ్చిన హామీ మేరకు విడతల వారీగా సాంఘిక భద్రతా పింఛన్లు పెంచి మాటకు కట్టుబడిన నాయకుడిగా గుర్తింపు పొందారని ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు అన్నారు. పట్టణంలోని పదవ వార్డులో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం మంగళవారం సాయంత్రం నిర్వహించారు. హాజరైన ఎమ్మెల్యే బ్రహ్మనాయుడు ఇంటింటికి వెళ్లి రాష్ట్రంలో అమలవుతున్న సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. అదేవిధంగా వైసీపీ అధికారంలోకి వచ్చిన మూడున్నర ఏళ్లలో పట్టణంలో జరిగిన అభివృద్ధి కార్యక్రమాలను తెలిపారు. గత పాలనలో పట్టణం ఎలాంటి అభివృద్ధికి నోచుకోలేదని మంచినీళ్ల కోసం మహిళలు ట్యాంకర్ల వద్ద పడిన పాట్లను వివరించారు. నేడు ఆ పరిస్థితి పట్టణంలో లేదని చెప్పారు. అదేవిధంగా వార్డు పరిధిలో సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి పొందుతున్న వారి వివరాలను తెలియజేశారు. అర్హులైన ప్రతి ఒక్కరు ప్రభుత్వ పథకాలకు దరఖాస్తులు చేసుకోవాలని రాజకీయాలకతీతంగా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ డాక్టర్ దస్తగిరి షకీలా, వైస్ చైర్మన్ బేతం గాబ్రియల్, సీకే రెడ్డి, మున్సిపల్ అధికారులు, మున్సిపల్ కమిషనర్ బి శ్రీనివాసులు, డి ఈ వెంకయ్య, సిబ్బంది వార్డు వాలంటీర్లు పాల్గొన్నారు.

వెంకటేశ్వర స్వామి ఆలయాన్ని సందర్శించిన జడ్జి

విశాలాంధ్ర-గుంటూరు : తూర్పుగోదావరి జిల్లా రాజమండ్రి సీనియర్ ప్రిన్సిపల్ జడ్జి తోట వరలక్ష్మి, లక్ష్మీ కోటేశ్వరరావు దంపతులు కుమార్తె జిత్యతో కలసి మంగళవారం స్థానిక లాలాపేట శ్రీ పద్మావతి అలివేలు మంగ సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి వారి దేవస్థానాన్ని సందర్శించారు. ఆలయ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ శ్రీనివాసరావు అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికి పూజలు నిర్వహించి స్వామివారి తీర్థప్రసాదాలు, చిత్రపటాన్ని అందజేశారు.

మతిమరుపుకు మరో కారణాన్ని కనుగొన్న కేఎల్‌యూ పరిశోధకుడు

విశాలాంధ్ర-తాడేపల్లి : మానవుల పురోగతి పరిశోధనలపైనే ఆధారపడి ఉందని మరోసారి రుజువైంది. మానవులకు అతిపెద్ద సమస్యగా మారిన మతిమరుపుపై కేఎల్ విశ్వవిద్యాలయ అధ్యయన బృందం చేపట్టిన పరిశోధనలో పలు ఆసక్తికర విషయాలను గుర్తించినట్లు విశ్వవిద్యాలయ ప్రో చాన్సలర్ డాక్టర్ కేఎస్ జగన్నాథరావు ఒక ప్రకటనలో తెలిపారు. విశ్వవిద్యాలయంలో బయోటెక్నాలజీ విభాగంలో అడ్వాన్స్ పరిశోధనపై అధ్యయనం చేస్తున్న డాక్టర్ షేక్ చాంద్ బాషా పోస్ట్-డాక్టోరల్ రీసెర్చ్ ఫెలో (పిడిఎఫ్)గా పనిచేస్తున్నారు. ఈయన చేపట్టిన పరిశోధనలో మతిమరుకు సంభందించిన నూతన శాస్త్రీయ కోణాన్ని గుర్తించారు. దీనిపై మరింతలోతుగా పరిశోదించడం కోసం తాను గుర్తించి పరిశోధక అంశం:న్యూరోనల్ డిస్‌ఫంక్షన్‌లో మైక్రోగ్లియాతో సంయోగం చేయడంలో ట్రెమ్ 2 పాత్రను అన్‌టాంగ్లింగ్ చేయడం. అను నూతన ఊహాజనితం 1 జర్నల్, జర్నల్ ఆఫ్ అల్జీమర్స్ వ్యాధి(జెఎడి)లో ఇంపాక్ట్ ఫ్యాక్టర్ 4.160తో ప్రచురణకు అంగీకరించబడిందని వారు తెలిపారు. అల్జీమర్స్ వ్యాధి, చిత్తవైకల్యానికి ప్రధాన కారణం, ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా 50 మిలియన్ల మంది ప్రజలు వచ్చే 2050 నాటికి ఈ సంఖ్య 152 మిలియన్లకు పెరగవచ్చని అంచనా వేశారు. మతిమరుపుకు (ఎడి)కి కారణాలు తెలియవు, కానీ వృద్ధాప్యం అనేది అతిపెద్ద ప్రమాదకారకం. మతిమరుపు(ఎడి) కోసం 10 హెచ్చరిక సంకేతాలు ఉన్నాయన్నారు. జ్ఞాపకశక్తి కోల్పోవడం, సమయం, స్థలం, దిక్కుతోచని స్థితి, రోజువారి జీవితాన్ని గడపడానికి కష్టపడడం, మారిన బావోద్వేగాల శాతం, క్షీణిస్తున్న తీర్పు నైపుణ్యాలు, మారిన వ్యక్తిత్వ మార్పులు, భాషా సమస్య, విషయాలు తప్పుగా ఉంచడం, నైరూప్య ఆలోచనలో ఇబ్బంది, చొరవ నైపుణ్యాల నష్టం వంటి పది రకాల లక్షణాలు కనిపించనప్పుడు మనిషి మతిమరుపు వ్యాధికి గురయ్యాడని గుర్తించవచ్చునన్నారు. వ్యాధిని గుర్తించడానికి ముందస్తు పరీక్షలు లేవన్నారు. వ్యాధికి కారణమయ్యే యంత్రాంగం ఇప్పటికీ స్పష్టంగా అర్థం కాలేదు, వ్యాధికి చికిత్స చేయడానికి తగిన మందులు కూడా లేకపోవడం ఆందోళన కలిగించే విషయని స్పష్టం చేశారు. ఈ అధ్యయనం కేఎల్ విశ్వవిద్యాలయం నుంచి చాంద్ బాషా వారి బృందం అల్జీమర్స్ వ్యాధిలో ట్రెమ్ 2 ఆధారిత నవల పాథోఫిజియోలాజికల్ మెకానిజమ్స్ గురించి ప్రతిపాదించారు. ట్రెమ్ 2 అనేది మైక్రోగ్లియల్ కణాల ఉపరితల గ్రాహకమని, ఇది మెదడులోని మృతకణాన్ని శుభ్రపరచడంలో సహాయపడుతుందని అన్నారు. ఈ గ్రాహకం అమిలాయిడ్ల వంటి మతిమరుపు(ఎడి) నిర్దిష్ట ప్రోటీన్‌ను కూడా తగ్గిస్తుందన్నారు. ట్రెమ్ 2 ఆధారిత చికిత్సా వ్యూహాలు భవిష్యత్ పరిశోధనలకు మంచి మార్గాలుగా ఉంటాయని పరిశోధనా బృందం ప్రతిపాదించింది. పని ప్రాముఖ్యతను గుర్తించి, డాక్టర్ షేక్ చాంద్ బాషాని జెఏడి జర్నల్‌కు అసోసియేటెడ్ ఎడిటర్‌గా ఆహ్వానించబడ్డారని తెలిపారు. కేఎల్ విశ్వవిద్యాలయం నుంచి ఆచార్య జానకీ రామయ్య, ప్రో.చాన్సలర్ డాక్టర్ కె.ఎస్. జగన్నాథరావుల మార్గదర్శకత్వంలో డాక్టర్ చాంద్ బాషా ఈ పరిశోధనని చేసినట్లు తెలిపారు. విశ్వవిద్యాలయం ఈ నిర్వహణ ఈ పరిశోధనకు మద్దతు ఇచ్చినట్లు స్పష్టం చేశారు.

సజ్జలను కలిసిన గులాం రసూల్

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సంయుక్త కార్యదర్శి గులాం రసూల్, శాసనమండలి సభ్యులు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి లేళ్ళ అప్పిరెడ్డి, గుంటూరు నగరపాలక సంస్థ మేయర్ కావటి శివనాగ మనోహర్‌నాయుడుతో కలిసి ప్రభుత్వ సలహాదారులు సజ్జల రామకృష్ణారెడ్డిని తాడేపల్లిలోని వారి కార్యాలయంలో మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సజ్జలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు.

'ఉపశమన సంరక్షణ చికిత్స'పై శిక్షణ

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : గుంటూరు ప్రభుత్వ సమగ్ర ఆసుపత్రి (జీజీహెచ్) ప్రాంగణంలో ఉన్న నాట్కో కేంద్రంలో మంగళవారం జాతీయ ఆరోగ్య మిషన్ ఆధ్వర్యంలో 'ఉపశమన సంరక్షణ చికిత్స'పై వివిధ విభాగాల వైద్యులు, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్‌కు శిక్షణా కార్యక్రమం జరిగింది. ఈ నెల 11వ తేదీ వరకు శిక్షణా తరగతులు జరగనున్నాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శి జీఎస్ నవీన్ కుమార్ హాజరై మాట్లాడుతూ గ్రామాల్లో దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడే రోగులకు మెరుగైన వైద్య సహాయం అందించడానికి వైద్యులు, వైద్య సిబ్బంది ఎంతో ఉపయోగమన్నారు. ఈ కార్యక్రమంలో క్యాన్సర్ హెచ్ఓడీ డాక్టర్ జి.దుర్గా ప్రసాద్ పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

విశాలాంధ్ర-వినుకొండ: పట్టణ ఎన్ఎస్పీ సబ్ డివిజన్ కార్యాలయంలో నూతన సంవత్సర క్యాలెండర్‌ను వినుకొండ ఎన్ఎస్పీ పిడబ్ల్యుడి యూనియన్ అధ్యక్షులు పి.ఇమ్మానుయేలు, సెక్రటరీ డివి శ్రీనివాసరావు కార్యవర్గ సభ్యులతో కలిసి ఆవిష్కరించారు. డైరీ, పోస్టర్ కూడా అవిష్కరించినట్లు తెలిపారు. ఎన్ఎస్పీ ఉద్యోగుల సమస్యలను తమ పీడబ్ల్యుడీ తరుపున పరిష్కరించుకుంటామని, ఇకపై కూడా ప్రతి సమస్యను పరిష్కరిస్తామని ఆయన తెలిపారు. అనంతరం ఎన్ఎస్పీ మానిటోరింగ్ డివిజన్ డిఈ ఆర్.ఎల్ రాజుకు పీడబ్ల్యుడీ వర్కర్స్ యూనియన్ డైరీ క్యాలెండర్ అందజేశారు.

అయ్యప్ప స్వామి గ్రామోత్సవం

విశాలాంధ్ర - భట్టిప్రోలు : శబరిమలై దీక్ష చేపట్టిన అయ్యప్ప దీక్షదారులు మంగళవారం గ్రామోత్సవం స్వామి వారి గ్రామోత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. స్థానిక రైలుపేటలోని అయ్యప్పస్వామి దేవాలయం వద్ద ప్రారంభమైన గ్రామోత్సవం గ్రామ పురవీధులలో భక్తి శ్రద్దలతో కోలాహాలంగా నిర్వహించారు 41 రోజులపాటు దీక్షను నిర్వహించిన భక్తులు నిష్ఠా గరిష్టలతో పూజలను నిర్వహించి అయ్యప్ప స్వామిని ప్రత్యేక వాహనంపై ఉంచి స్వాములు, భవాని మాతలు అయ్యప్ప స్వామి, దుర్గాదేవి శ్లోకాలతో గ్రామోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ గ్రామోత్సవంలో దుర్గామాత వేషధారణ భక్తులను పుర ప్రజలను ప్రత్యేకంగా ఆకర్షించింది ఈ కార్యక్రమాలను గురు స్వాములు పర్యవేక్షించారు

ఎస్టీయూ కాలమాని ఆవిష్కరణ

విశాలాంధ్ర-సత్తెనపల్లి : ఎస్టీయూ సత్తెనపల్లి శాఖ నూతన సంవత్సర కాలమానిని సత్తెనపల్లి డివిజన్ డిప్యూటీ విద్యాశాఖాధికారి వి.వెంకటేశ్వరరావు, మండల విద్యాశాఖాధికారి ఏ.శ్రీనివాసరావులు మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేసి డైరీ, క్యాలెండర్‌లను వారికీ యూనియన్ నాయకులు అందచేశారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు ఎస్ఎం రహమాన్, ప్రధాన కార్యదర్శి కె.సురేష్, రాష్ట్ర, జిల్లా, మండల నాయకులు పాల్గొన్నారు.

రుణసదుపాయ కార్యక్రమం

విశాలాంధ్ర-గుంటూరు : ప్రముఖ ప్రైవట్ బ్యాంక్ సంస్థ తమిళ్‌నాడ్ మర్కంటైల్ బ్యాంక్ లిమిటెడ్ ఆధ్వర్యంలో సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు క్రెడిట్ ఋణ సదుపాయాన్ని పెంచుటకు సంబంధించిన కార్యక్రమాన్ని మంగళవారం గుంటూరులోని ఒక హోటల్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బ్యాంక్ హైదరాబాద్ రీజనల్ మేనేజర్ ఎం.రాజప్పన్, గుంటూరు బ్రాంచ్ చీఫ్ మేనేజర్ సి.దినకర్ జెబాకుమార్ పర్యవేక్షణలో నిర్వహించారు. జనరల్ మేనేజర్ (క్రెడిట్) ఎస్.నారాయణన్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు.

నేడు వైఎస్సార్ పెన్షన్ కానుక వారోత్సవాలు

విశాలాంధ్ర-బొల్లాపల్లి : మండల కేంద్రమైన బొల్లాపల్లిలో బుధవారం ఉదయం తొమ్మిది గంటలకు వైఎస్సార్ పెన్షన్ కానుక వారోత్సవాలు కార్యక్రమం నిర్వహించనున్నట్లు మండల పరిషత్ అభివృద్ధి అధికారి తెలిపారు. మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, జడ్పీటీసీ, లబ్ధిదారులు సకాలంలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

పాడి రైతులు ఆర్థిక పురోభివృద్ధి సాధించాలి

విశాలాంధ్ర-ఫిరంగిపురం: గ్రామీణ ప్రాంతాల్లో మహిళా పాడి రైతులు ఆర్థిక పురోభివృద్ధి సాధించాలని గుంటూరు డివిజన్ పశు సంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ కె.వి.వి. సత్యనారాయణ అన్నారు. జగనన్న పాలవెల్లువ కార్యక్రమంలో భాగంగా జగనన్న చేయూత ద్వారా ప్రభుత్వం అందజేస్తున్న పాడి పరిశ్రమ లబ్ధిదారుల వివరాలను తెలుసుకొనేందుకు మంగళవారం మేడికొండూరు, ఫిరంగిపురం మండలాల్లో అకస్మికంగా సందర్శించి అధికారులను వివరాలపై ఆరా తీసి రికార్డులను పరిశీలించారు. ఫిరంగిపురంలో రెండు మండలాల అధికారులతో డి.డి మాట్లాడుతూ పాలు పోసే రైతులకు బ్యాంకుల ద్వారా రుణాలు ఇప్పించి ప్రభుత్వమే పాడి గేదెలను కొనుగోలు చేసి గ్రామాల్లో పాడి పరిశ్రమకు పూర్వ వైభాన్ని తీసుకొచ్చేందుకు ప్రభుత్వం ప్రణాళికను రూపొందించిందని గుర్తు చేశారు. ఫిరంగిపురం మండలంలో -355మంది, మేడికొండూరు మండలంలో 500మందికి పైగా రైతులు వివరాలు ఉన్నాయని వారిని ప్రోత్సాహించి పాడి పరిశ్రమను అభివృద్ధి చేయడమే లక్ష్యంగా రైతుల్లో చైతన్యం కల్పించాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ డైరెక్టర్ ఆర్.శ్రీనివాసరావు, ఫిరంగిపురం, మేడికొండూరు వెటర్నరి డాక్టర్లు కోటి రత్నం, మౌనిక సిబ్బంది పాల్గొన్నారు.

మహిళ ఆచూకి తెలపండి

విశాలాంధ్ర-ఫిరంగిపురం: రేపూడి గ్రామానికి చెందిన 65 సంవత్సరాలు వయస్సు గల ఆరె.కృష్ణకుమారి ఈ నెల 1వ తేది నుంచి కనిపించదంలేదు. పోలీసుల వివరాల ప్రకారం కృష్ణకుమారి 5 అడుగులు ఎత్తు కలిగిఉంటుంది. తులుగు మాట్లాడ గలదని ఇంటిలో ఎవరికి చెప్పకుండా 1వతేదిన ఇంటి నుంచి వెళ్లిపోయిందని కృష్ణ కుమారి కుమారుడు ఆరె.ఉదయ్ దీపక్‌రెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు యస్.ఐ. లక్ష్మీనారాయణరెడ్డి మంగళవారం తెలిపారు. ఆచూకి తెలిసిన వారు 9492089360-7396584000లకు సమాచారం అందించాలన్నారు.